www.akshratimes.com
తెలుగు దినపత్రిక
# అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
RNI.NO : APTEL/2022/90211
సంపుటి : 04 సంచిక : 75 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com గురువారం 02 - 07 - 2026
Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool


బండి భగీరథ్ పోక్సో కేసు బాధితురాలి వాదన వినేందుకు ఆమెకు నోటీసులు జారీ



## 'మావిగన్ వర్సెస్ అమరావతి' చూసుకుందాం

- వైసీపీ అధినేత జగన్
- తాము మావిగన్ కు కట్టుబడి ఉన్నామన్న జగన్
- మావిగన్ కు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకి ఓటు వేస్తారని వ్యాఖ్య
- ఎన్నికల మేనిఫెస్టోలో కూడా మావిగన్ ను చేరుస్తామని స్పష్టీకరణ

**అమరావతి :**
ఏపీ రాజధాని అమరావతిని వైసీపీ అధినేత జగన్ మరోసారి తిరస్కరిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము మావిగన్ కే కట్టుబడి ఉన్నామని... వచ్చే ఎన్నికలు మావిగన్ వర్సెస్ అమరావతి అని - మిగతా 2 లో

## పెట్టుబడుల్లో దేశంలోనే
# ఏపీ నెంబర్ 1

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- గూడూరులో మెగా ఫర్నిచర్ పార్క్
- గూడురు ఫర్నిచర్ పార్క్ ద్వారా 10 వేల మందికి ఉపాధి లభిస్తుందన్న సీఎం
- 'పీ4' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చంద్రబాబు పిలుపు
- ఇంటికో పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే తమ సంకల్పమని వెల్లడి
- ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అని మరోసారి హెచ్చరించిన సీఎం



**అమరావతి :**
పేదలకు అండగా ఉంటూ సంక్షేమం అందిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. పేదరిక నిర్మూలనకు అందరూ కృషి చేయాలని పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లా పున్నపువారిపాలెం ప్రజావేదిక సభలో చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. పేదవారందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తాం. డ్వాక్రా సంఘాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ఇంటికో పారిశ్రామికవేత్త తయారు కావాలి. అందరికీ సంక్షేమ - మిగతా 2 లో


# శెహభాష్.. లోకేశ్



- విద్యా శాఖ మంత్రిగా లోకేశ్ పనితీరుకు రాష్ట్రపతి ప్రశంసలు
- ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేశ్‌పై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు
- రాష్ట్రంలో విద్యా సంస్కరణలు కొనసాగించాలని సూచన
- అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ స్నాతకోత్సవం అనంతరం ఘటన
- లోకేశ్ ప్రసంగం యువతకు స్ఫూర్తినిచ్చేలా ఉందని అభినందన

**అమరావతి :**
ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పనితీరుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు అద్భుతంగా ఉన్నాయని, వాటిని భవిష్యత్తులోనూ కొనసాగించాలని సూచించారు. అనంతపురంలోని ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవంలో పాల్గొన్న - మిగతా 2 లో

## భారత్, పాక్ మధ్య శాంతి చర్చలు పునఃప్రారంభించాలి




- మోదీ, షరీఫ్‌కు 100 మందికిపైగా ప్రముఖుల బహిరంగ లేఖ
- భారత్, పాకిస్థాన్ ప్రధానులకు 100 మందికిపైగా ప్రముఖుల విజ్ఞప్తి
- భారత్, పాక్ మధ్య శాంతి చర్చలు తిరిగి ప్రారంభించాలని లేఖ
- ఉద్రిక్తతలకు ముగింపు పలకాలని పిలుపు

**ఢిల్లీ :**
భారత్- పాకిస్థాన్ మధ్య దౌత్య సంబంధాల్ని పునరుద్ధరించి, ద్వైపాక్షిక చర్చల్ని తిరిగి ప్రారంభించాలని ఇరు దేశాలకు చెందిన దాదాపు 100 మందికిపైగా ప్రముఖులు సంయుక్తంగా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు బహిరంగ లేఖ రాశారు. దక్షిణాసియాలో శాంతి, స్థిరత్వం, అభివృద్ధి కోసం ఘర్షణలకు బదులుగా సంభాషణ, సహకార మార్గాన్ని ఎంచుకోవాలని ఇరు ప్రభుత్వాల్ని కోరారు. రెండు దేశాల మధ్య దౌత్య, వాణిజ్య, రవాణా సంబంధాల్ని మునుపటిలా సాధారణ స్థితికి తీసుకురావాలని అభ్యర్థించారు. జూన్ 30వ తేదీతో విడుదలైన ఈ బహిరంగ లేఖపై భారత్‌కు చెందిన 61 మంది, పాకిస్థాన్‌కు చెందిన దాదాపు 55 మంది ప్రముఖులు సంతకాలు చేశారు. సెంటర్ ఫర్ పీస్ ప్రోగ్రెస్ ఛైర్మన్ ఓపీ షా సమన్వయంతో ఈ లేఖను రూపొందించారు.ఇక ఈ - మిగతా 2 లో


## ఒడిశా పాఠ్యపుస్తకాల్లో బాలీవుడ్ పాట.. వెలుగులోకి వేలకొద్దీ తప్పులు!

- ఒడిశా 5వ తరగతి పాఠ్యపుస్తకంలో 'నిమ్బూడ నిమ్బూడ' పాట ముద్రణ
- విచారణకు ఆదేశించిన సీఎం.. బాధ్యులపై చర్యలు తీసుకున్నామన్న మంత్రి
- సరిదిద్దిన పుస్తకాలను పంపిణీ చేస్తామని ప్రభుత్వం వెల్లడి


2 లో

## వాట్సాప్ కొత్త ఫీచర్‌పై కేంద్రం ఆందోళన
# మోసాలకు ఆస్కారం!

- వాట్సాప్ కొత్త యూజర్‌నేమ్ ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం పరిశీలన
- మోసాలు, ఫేక్ ప్రొఫైల్స్ పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన
- ఫోన్ నంబర్ లేకుండానే ఇతరులతో కనెక్ట్ అయ్యే సదుపాయమిది
- భద్రతా చర్యలు తీసుకున్నామంటున్న వాట్సాప్ యాజమాన్యం




**ఢిల్లీ :**
మెటా యాజమాన్యంలోని వాట్సాప్ ఇటీవల ప్రవేశపెట్టిన 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై భారత ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ కొత్త ఫీచర్ ద్వారా ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ ప్రొఫైల్స్‌తో ఇతరులను మోసగించడం (ఇంపర్సొనేషన్) వంటివి పెరిగే అవకాశం ఉందంటూ ప్రభుత్వ అధికారులు - మిగతా 2 లో

## మూడెకరాల రైతులకు శుభవార్త


2 లో

- రైతు భరోసా నిధులు జమ
- 10.68 లక్షల మందికి లబ్ధి
- రూ.1,590.02 కోట్లు జమ
- డీబీటీ ద్వారా ఖాతాల్లోకి నిధులు
- ఇప్పటివరకు రూ.4,072.04 కోట్లు విడుదల
- 54.96 లక్షల మంది రైతులకు లబ్ధి



## రాముడి గుడిలోనే దొంగతనమా?

- మోదీ, అమిత్ షాలపై జగ్గారెడ్డి ఆగ్రహం
- అయోధ్య రామమందిరంలో హుండీ డబ్బుల చోరీపై జగ్గారెడ్డి ఆగ్రహం
- యూపీలో, కేంద్రంలో బీజేపీ ఉన్నా దొంగతనం జరిగిందని మండిపాటు
- ప్రజలకు మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్

**హైదరాబాద్ :**
అయోధ్య శ్రీరామ మందిరంలో భక్తులు సమర్పించిన హుండీ డబ్బుల చోరీ ఘటనపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూపీలోనూ, కేంద్రంలోనూ బీజేపీ ప్రభుత్వమే ఉన్నా, - మిగతా 2 లో

## కవిత పార్టీ పేరుపై అభ్యంతరాల వెల్లువ
# ఈసీకి 700 ఫిర్యాదులు



- కవిత కొత్త పార్టీ 'తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)' పేరుపై అభ్యంతరం
- కేంద్ర ఎన్నికల సంఘానికి దాదాపు 700 అభ్యంతరాలు
- ఫిర్యాదు చేసిన వారిలో అత్యధికం బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలే
- అభ్యంతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్న ఈసీ

**హైదరాబాద్ :**
కల్వకుంట్ల కవిత స్థాపించిన నూతన రాజకీయ పార్టీ పేరుపై సందిగ్ధత కొనసాగుతోంది. ఆమె ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)' పేరుపై కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) దాదాపు 600 నుంచి 700 వరకు అభ్యంతరాలు అందాయి. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి - మిగతా 2 లో

## ఏఐతో అనుసంధానం, ఆ శాఖల్లో
# లీకులు లేకుండా చూడండి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రాష్ట్ర ఆదాయ సమీకరణపై అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- ప్రభుత్వానికి ఆదాయం పెంపుపై అధికారులతో సమావేశం
- ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందేనన్న సీఎం రేవంత్



**హైదరాబాద్ :**
రాష్ట్ర ఆదాయ సమీకరణపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయం పెరగాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ ఆదాయ సమీకరణపై దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్‌శాఖ, మైనింగ్‌శాఖల్లో లీకులు లేకుండా చూడాలని సూచించారు. ఆదాయ సమీకరణ కోసం చేజింగ్ సెల్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏఐతో లబ్ధిదారుల జాబితాను డీబీటీకి అనుసంధానం చేయాలని సూచించారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేలా బడ్జెట్‌ను తయారు చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్టుల భూసేకరణకు మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. బడ్జెట్ ఊహాజనితంగా కాకుండా వాస్తవికంగా రూపొందించుకోవాలన్నారు. వివిధశాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఆదాయం పెంపు, - మిగతా 2 లో

# సంపాదకీయం

## డేటా సెంటర్లపై బేజారు

చార్లీ చాప్లిన్ అద్భుత దృశ్యకావ్యాల్లో ఒకటైన ‘గోల్డ్ రష్’ నిరుడు శతవసంతాలు పూర్తిచేసుకుంది. 1890ల్లో కెనడాలోని క్లోన్‌డైక్ ప్రాంతంలో బంగారం గనులున్నాయని వెల్లడై ప్రపంచం నలుమూలలనుంచీ వేలాదిమంది జనం అక్కడికి పరుగులు తీయడం, పోటీపడటం కథాంశం. ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ కృత్రిమ మేధ(ఏఐ)కి సంబంధించిన డేటా సెంటర్లలో పెట్టుబడుల్ని ఆకర్షించటానికి అలాగే పరుగులు తీస్తున్నాయి. నిరుడు అక్టోబర్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరం విడుదల చేసిన విశ్లేషణ డేటా సెంటర్ల సామర్థ్యం మరో నాలుగేళ్లలోనే మూడు రెట్లు పెరుగుతుందని అంచనా వేసింది. అదే సమయంలో తీవ్ర ఉష్ణోగ్రతలు, కరువుకాటకలు, ఇతర వాతావరణ దుష్ఫలితాల కారణంగా డేటా సెంటర్ల వార్షిక ఖర్చులు 2035కు 8,100 కోట్ల డాలర్లనుంచి 2065 నాటికి 16,800 కోట్ల డాలర్లకు పెరుగుతాయని అంచనా వేసింది. ఇప్పటికే క్లౌడ్ కంప్యూటింగ్ నిర్వహించటానికి... ఓటీటీలు, యూట్యూబ్‌వంటి వాటికోసం లైబ్రరీల నిర్వహణకూ, ఇతరేతర వినియోగానికీ డేటా సెంటర్లున్నాయి. ఏఐ రాకతో ఇవి మరింతగా పెరుగుతున్నాయి.డేటా సెంటర్ల విస్తరణతోపాటే వాటికి సంబంధించిన అవగాహన మొదలైంది. వాటివల్ల కలిగే దుష్పరిణామాల గురించి ఇప్పుడిప్పుడే అందరికీ తెలుస్తోంది. ఆన్‌లైన్ సెర్చ్‌లతో పోలిస్తే ఏఐ ఆధారిత సెర్చ్‌లు పది రెట్లు అధిక విద్యుత్‌ను తీసుకుంటున్నా యని గణాంకాలు తేల్చాయి. ఈమధ్య విడుదలైన ఐక్యరాజ్యసమితికి చెందిన యూనివర్సిటీ అధ్యయన నివేదిక డేటా సెంటర్లను చల్లబరచడానికి బిలియన్లకొద్దీ లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు ఆవిరైపోతున్నదని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ డేటా సెంటర్ల వల్ల తాగునీటి హక్కులకూ, వ్యవసాయానికీ తీవ్ర విఘాతం కలుగుతోందని హెచ్చరించింది. వీటిని అనుమతించే ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో పునరుత్పాదక ఇంధన వనరు లున్న ప్రాంతాలనే ఎంచుకునేలా చూడాలని సూచించింది. వినియోగిస్తున్న నీరు ఆవిరయ్యే ప్రస్తుత విధానానికి బదులు నీటి అవసరం లేని ఎయిర్ కూలింగ్, లిక్విడ్ ఇమ్మర్షన్ కూలింగ్‌వైపు మారేలా డేటా సెంటర్లపై ఒత్తిడి తేవాలని ప్రభుత్వాలకు సలహా ఇచ్చింది. డేటా సెంటర్లు తాము వినియోగించే నీరు, విద్యుత్ ఎంతో... విడుదలయ్యే కర్బన ఉద్గారాల పరిమాణం ఎంతో తెలిపే డేటాను అందరికీ అందుబాటులో ఉంచేలా నిబంధనలు రూపొందించాలని తెలిపింది.డేటా సెంటర్లపై అక్కడక్కడా ఆందోళనలు పెరుగుతున్నాయి. ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌లో ఈ సెంటర్లు పెరగటాన్ని నిరసిస్తూ ఉద్యమాలు జరగటంతో కొత్తవాటిపై కఠిన మైన ఆంక్షలు విధించారు. నెదర్లాండ్స్‌లో కూడా రైతులు, పర్యావరణవేత్తలు ఆందోళ నలు చేశారు. దాంతో హైపర్‌స్కిల్ డేటాసెంటర్ల నిర్మాణాలను ప్రభుత్వం తాత్కాలికంగా నిషేధించింది. సింగపూర్‌లో పర్యావరణహిత సెంటర్లకు పరిమితమైన అనుమతు లిస్తున్నారు. చిలీలో డేటా సెంటర్ ఏర్పాటుపై జనం తిరగబడటంతో గూగుల్ సంస్థ గాలితో చల్లబరిచే సాంకేతికత దిశగా ప్రాజెక్టును డిజైన్ చేసుకుంది.ఏడాదిలో 365 రోజులూ వేలాది సర్వర్ రాక్‌లూ, డిజిటల్ డేటాను భద్రపరిచే హార్డ్ డ్రైవ్‌లూ, నెట్‌వర్కింగ్ పరికరాలూ, లక్షలసంఖ్యలో యూపీఎస్‌లు పనిచేస్తుండటంవల్ల వాటిని చల్లబరచటానికి నిరంతరాయంగా నీరు అవసరమవుతుంది. భారీగా విద్యుత్ కావలసివస్తుంది. ఇక ఆ సెంటర్లలోవాడే భారీ కూలింగ్ ఫ్యాన్లు , ఇండస్ట్రియల్ ఏసీల వల్ల ఒకరకమైన ధ్వని తప్పదు. పగలు ఇతర చప్పుళ్లతో ఇది కలిసిపోయినా, రాత్రివేళల్లో మూడు నాలుగు కిలోమీటర్ల మేర ఈ ధ్వని వినబడుతుంది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో, అమెరికాలోని వర్జీనియాలో కేవలం ఈ కారణం వల్లే స్థానికులు కోర్టులకెక్కారు.ప్రజల ఒత్తిళ్లతో ఈమధ్య కాలిఫోర్నియాలోని ఒక మున్సిపాలిటీ కొత్త డేటా సెంటర్లపై నిషేధం విధించింది. వీటన్నిటి నేపథ్యంలో నీటి అవసరం పెద్దగా లేని సాంకేతికతలు వస్తున్నాయి. ఏఐ ఆధారిత సాంకేతికత ద్వారా ఒక్క చుక్క నీరు కూడా అదనంగా వినియోగించకుండా కట్టడి చేస్తున్నారు. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరిస్తే, ఆ సెంటర్లు వినియోగించే పర్యావరణహిత సాంకేతికతల సమాచారాన్నీ, వాటి ఉద్గారాల పరిమాణాన్నీ ప్రజలకూ, పర్యావరణవేత్తలకూ అందుబాటులో ఉంచితే ప్రజల్లో ఉండే ఆందోళన తగ్గుతుంది.

# పెట్టుబడుల్లో దేశంలోనే ఏపీ నెంబర్ 1

**మొదటిపేజీ తరువాయి -** ఫలాలు అందాలి. అన్ని ప్రాంతాలు అభివృద్ధి కావాలి. పారిశ్రామిక అభివృద్ధిలో ఏపీ చాలా ముందుంది. దేశంలోనే మెగా ఫర్నిచర్ పార్క్ గూడూరులో వస్తోంది. 10 వేల మందికి ఉపాధి కల్పించబోతున్నాం. దేశానికి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయి. ఒకప్పుడు పెట్టుబడి దారులు పారిపోయారు. ఇప్పుడు రాష్ట్రాన్ని వెతుక్కుంటూ వస్తున్నారు. నమ్మకం కలిగించినందుకే రాష్ట్రానికి క్యూ కడుతున్నారు” అని చంద్రబాబు అన్నారు.తన రాజకీయ జీవితంలో ఎన్నో పార్టీలను చూశానని, నేరాలు చేసే పార్టీని, నేరస్థులను కాపాడే పార్టీని చరిత్రలో మొదటిసారి ఇప్పుడే చూస్తున్నానని మండిపడ్డారు. అర్హత లేనివాళ్లకు అందలం ఎక్కిస్తే చాలా సమస్యలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.నష్టపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అవుతుందని మరోసారి హెచ్చరించారు. హోంమంత్రి అనితపై అసభ్య వ్యాఖ్యలను తప్పుబట్టారు. గొడ్డలి పార్టీ నేత సతీమణిపై పోస్టు పెడితే వెంటనే అరెస్టు చేశామని, ఆడవాళ్లపై నోరు పారేసుకున్న ఎవరినీ వదిలిపెట్టబోమని తేల్చి చెప్పారు. విజయవాడలో ఒక వ్యక్తి అదృశ్యమయ్యారని, ఆయనను అరెస్టు చేసిన తర్వాతే మిస్ అయ్యాడని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ విషయం తన దృష్టికి రాగానే సిట్ వేసి దర్యాప్తు ప్రారంభించామని, తప్పు చేసింది పోలీసులైనా సరే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించానని చెప్పారు. అయితే, ఈ వ్యవహారానికి కొందరు కుల ముద్ర వేసి విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టారని, అసలు ఇలాంటి అసభ్యకర పోస్టులతో ఏం సాధించాలని అనుకుంటున్నారని చంద్రబాబు ప్రశ్నించారు. గతంలో తన భార్యను అసెంబ్లీ సాక్షిగా దూషిస్తే, తాము ఎంతో మానసిక క్షోభ అనుభవించామని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు ఏకంగా డిప్యూటీ సీఎం కుమార్తెలపై కూడా నీచమైన పోస్టులు పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గొడ్డలి పార్టీ కులమతాల మధ్య చిచ్చుపెడుతూ అమరావతిపై దుష్ప్రచారం చేస్తోందని, గత ఐదేళ్లలో మూడు ముక్కలాట తప్ప ఏమీ చేయలేదని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. భవిష్యత్తులో అన్ని ఏసీ బస్సులే నడుపుతామన్నారు. లబ్ధిదారులు ఏదైనా ఒక నెలలో తీసుకోకపోయినా, మూడు నెలల పింఛన్ ఒకేసారి ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి తాను, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి ముందుకొచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్ర మాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, సుపరిపాలనకు నాంది పలికామని హర్షం వ్యక్తం చేశారు. ‘మన మిత్ర’ యాప్‌లోనే అన్ని ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచామని, 62.20 లక్షల మంది కోసం ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. తాను ఇంట్లో కూర్చుని బటన్ నొక్కేవాణ్ని కాదని, ప్రజల్లో ఉండే వ్యక్తినన్నారు. 28 కేటగిరీల వారికి పండుగ వాతావరణంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందిస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో ఆగస్టు 15 నుంచి ‘సంజీవని ప్రాజెక్టు’ తీసుకువస్తున్నామని, రాబోయే రోజుల్లో ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గంజాయికి ఆంధ్రప్రదేశ్‌లో అస్సలు చోటు లేదని, రాష్ట్రాన్ని పూర్తిగా డ్రగ్ రహితంగా తయారుచేస్తామని స్పష్టం చేశారు. విద్యా రంగంలో మార్పులు వస్తున్నాయని, ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ బడుల్లోకి విద్యార్థుల ప్రవేశాలు పెరుగుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు.

## భారత్, పాక్ మధ్య శాంతి చర్చలు పునఃప్రారంభించాలి

**మొదటిపేజీ తరువాయి -** లేఖపై జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ఫరూక్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ, మాజీ రా భారత గూఢచార సంస్థ) చీఫ్ ఏఎస్ దులత్, రాజ్యసభ సభ్యుడు మనోజ్ ఝా, కేంద్ర మాజీ మంత్రి మణిశంకర్ అయ్యర్, మితవాద వేర్పాటువాద నాయకుడు మిర్వైజ్ ఉమర్ ఫరూక్, పాకిస్థాన్ మాజీ విదేశాంగ శాఖ మంత్రి ఖుర్షీద్ మహ్మూద్ కసూరీ, మాజీ దౌత్యవేత్త అష్రఫ్ జహంగీర్ ఖాజీతో పాటు పలువురు మాజీ రాయబారులు, పౌర సమాజ ప్రతినిధులు సంతకాలు చేశారు.ఈ సందర్భంగా భారత్, పాక్ మధ్య విభేదాల్ని పరిష్కరించేందుకు నిరంతర ద్వైపాక్షిక చర్చలే ఏకైక మార్గమని లేఖలో వారు పేర్కొన్నారు. దక్షిణాసియాలో శాంతిని నెలకొల్పడం, పరస్పర సహకారాన్ని పునరుద్ధరించడం, సాధారణ పరిస్థితులకు తీసుకొచ్చేందుకు రెండు దేశాల ప్రభుత్వాలు అర్థవంతమైన, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో రెండు దేశాల మధ్య పూర్తి స్థాయిలో దౌత్య సంబంధాల్ని పునరుద్ధరించాలని, హైకమిషనర్లను తిరిగి నియమించాలని, సాధారణ వీసా సేవల్ని కూడా పునఃప్రారంభించాలని లేఖలో సూచించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న అన్ని ద్వైపాక్షిక అంశాలపై సమగ్ర చర్చలు ప్రారంభించాలని కోరారు.జమ్ముకశ్మీర్‌కు సంబంధించిన అన్ని అంశాలపైనా చర్చలు కొనసాగించాలని ఆ ప్రముఖులు లేఖలో పేర్కొన్నారు. 2004 నుంచి 2007 వరకు ఇరు దేశాలు చర్చించిన అంశాల్ని మరోసారి పరిశీలించాలని సూచించారు. ఇరు దేశాల భద్రతా ఆందోళనలను దృష్టిలో పెట్టుకొని సైనిక ఉద్రిక్తతల్ని తగ్గించే చర్యలు చేపట్టాలని కోరారు. లేఖలో పేర్కొన్న ఇతర అంశాలు చూస్తే- ‘భారత్ పాకిస్థాన్ మధ్య వాణిజ్య సంబంధాలు తిరిగి ప్రారంభించాలి. అట్టారీ వాఘా సరిహద్దు వాణిజ్య మార్గాన్ని తిరిగి తెరవాలి. దిల్లీ- లాహోర్ బస్సు సర్వీస్, శ్రీనగర్- ముజఫరాబాద్ బస్సు సర్వీస్, సంఝౌతా ఎక్స్‌ప్రెస్, థార్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవల్ని పునరుద్ధరించాలి. కార్గిల్ స్కార్దూ మార్గాన్ని తెరవాలి. కమర్షియల్ ఫ్లైట్స్ తిరిగేందుకు వీలుగా ఇరు దేశాలు గగనతలాల్ని మళ్లీ అందుబాటులోకి తీసుకురావాలి’ అని విజ్ఞప్తి చేశారు.ఇదే సమయంలో కర్తార్‌పుర్ సాహిబ్ కారిడార్‌ను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని, శారదా పీఠాన్ని యాత్రికుల కోసం తెరవాలని లేఖలో సూచించారు. ‘దక్షిణాసియా భవిష్యత్తు- విభేదాలు, ఘర్షణలతో కాకుండా శాంతి, అభివృద్ధి, పరస్పర సహకారంతో ముందుకు సాగాలి’ అని పేర్కొన్నారు. చివరగా ఇది ఏ రాజకీయ వైఖరికి మద్దతుగా రాసిన లేఖ కాదని, దాదాపు 200 కోట్ల మంది ప్రజల సంక్షేమం, ఆశయాల్ని దృష్టిలో పెట్టుకొని చేసిన విజ్ఞప్తి మాత్రమేనని స్పష్టం చేశారు. భారత్- పాకిస్థాన్ జనాభాలో అధిక శాతం యువతేనని, ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల లక్షలాది మంది యువత ఉపాధి, విద్య, వ్యాపారం, అభివృద్ధి అవకాశాల్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు. అందుకే ఘర్షణకు బదులుగా సహకారం, శత్రుత్వానికి బదులు సంభాషణ, ఒంటరితనానికి బదులుగా పరస్పర భాగస్వామ్యాన్ని ఎంచుకోవాలని ఇరు ప్రభుత్వాల్ని కోరారు.

## ఒడిశా పాఠ్యపుస్తకాల్లో బాలీవుడ్ పాట.. వెలుగులోకి వేలకొద్దీ తప్పులు!

**మొదటిపేజీ తరువాయి -**

ఒడిశాలో విద్యావ్యవస్థలో జరిగిన ఓ భారీ తప్పిదం తీవ్ర దుమారం రేపుతోంది. ఐదో తరగతి విద్యార్థుల కోసం ముద్రించిన ప్రభుత్వ పాఠ్యపుస్తకంలో ఏకంగా ఓ ప్రముఖ బాలీవుడ్ సినిమా పాటను అచ్చు వేయడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయం వెలుగులోకి రావడంతో సోషల్ మీడియాలో విద్యాశాఖపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. కొందరు ఈ పొరపాటును ట్రోల్ చేయగా, మరికొందరు ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఒడిశా ప్రభుత్వ పాఠశాలల్లో వినియోగిస్తున్న 5వ తరగతి పాఠ్యపుస్తకంలోని ఓ పాఠంలో ఈ పొరపాటు చోటుచేసుకుంది. 1999లో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిందీ చిత్రం ‘హమ్ దిల్ దే చుకే సనమ్’లోని సూపర్ హిట్ పాట ‘నిమ్మూడ నిమ్మూడ’ను యథాతథంగా ముద్రించారు. ఐశ్వర్య రాయ్‌పై చిత్రీకరించిన ఈ పాట, వాస్తవానికి ఓ రాజస్థానీ జానపద గీతం. పుస్తకాల ప్రింటింగ్ లేదా ప్రచురణ దశలో జరిగిన తీవ్రమైన నిర్లక్ష్యం కారణంగానే ఈ భారీ తప్పిదం జరిగిందని భావిస్తున్నారు. ఈ ఘటన రాష్ట్ర విద్యావ్యవస్థ, పాఠ్యపుస్తకాల సమీక్షా కమిటీల పనితీరుపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది.అయితే, ఈ సినిమా పాట ముద్రణ ఒక్కటే పొరపాటు కాదని, రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) పుస్తకాల్లో ఇలాంటివి వేల సంఖ్యలో ఉన్నాయని తేలడం గమనార్హం. మొత్తం పాఠ్యపుస్తకాల్లో 1,600కు పైగా తప్పులు ఉన్నట్టు గుర్తించారు. వీటిలో 8వ తరగతి పుస్తకాల్లోనే అత్యధికంగా 705 తప్పులు ఉన్నాయి. ఈ తప్పుల్లో కొన్ని విస్తుపోయేలా ఉన్నాయి. ఉదాహరణకు, కర్ణాటక అసెంబ్లీ భవనాన్ని ఒడిశా విధాన సభగా, గొప్ప శాస్త్రవేత్త సర్ ఐజాక్ న్యూటన్‌ను ‘గొప్ప పైలట్’గా, కర్ణాటకలోని హంపిని కోణార్క్ సూర్య దేవాలయంగా పేర్కొన్నారు. వీటితో పాటు వ్యాకరణ దోషాలు, స్పెల్లింగ్ తప్పులు, తప్పుడు సమాచారం వంటివి కోకొల్లలుగా ఉన్నాయి.ఈ వ్యవహారంపై ఒడిశా పాఠశాల, సామూహిక విద్యాశాఖ మంత్రి నిత్యానంద గోండ్ స్పందించారు. పాఠ్యపుస్తకాల్లోని తప్పులను ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణించిందని తెలిపారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణకు ఒక కమిటీని ఏర్పాటు చేశారని, నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని ఆయన వెల్లడించారు.“సరిదిద్దిన పాఠ్యపుస్తకాల కాపీలను వెంటనే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనివల్ల విద్యార్థుల చదువుపై ఎలాంటి ప్రభావం పడకుండా, వారికి సరైన సమాచారం అందుతుంది” అని మంత్రి వివరించారు. కొత్త పుస్తకాలు చేరే వరకు, ప్రస్తుతం ఉన్న పుస్తకాల్లోని తప్పులను ఉపాధ్యాయులే సరిదిద్ది విద్యార్థులకు బోధించాలని సూచించినట్టు ఆయన తెలిపారు. మొత్తం మీద ఈ ఘటన ఒడిశాలో పాఠ్యపుస్తకాల నాణ్యతా తనిఖీల ప్రక్రియపై తీవ్ర చర్చకు దారితీసింది.

## కవిత పార్టీ పేరుపై అభ్యంతరాల వెల్లువ.. ఈసీకి 700 ఫిర్యాదులు



**మొదటిపేజీ తరువాయి -** చర్చనీయాంశంగా మారింది.ఈ అభ్యంతరాలను ప్రధానంగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు వ్యక్తం చేశారు. గతంలో ‘తెలంగాణ రాష్ట్ర సమితి’గా ఉన్న తమ పార్టీ పేరును ఇది పోలి ఉండటం వల్ల ప్రజల్లో గందరగోళం తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు అభ్యంతరాలపై కవిత పార్టీ ప్రతినిధులు ఈసీకి వివరణ ఇచ్చారని, మిగిలిన వాటికి కూడా సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని సమాచారం.తెలంగాణ ఉద్యమంలో ‘టీఆర్ఎస్’ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. 2026 ఏప్రిల్ నెలాఖరులో కవిత తన నూతన పార్టీని ప్రకటించిన సమయంలో, ఈ పేరుపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. అనంతరం, ఈసీఐ అభ్యంతరాల స్వీకరణకు 30 రోజుల గడువు ఇచ్చింది. జూన్ నెలలో బీఆర్ఎస్ పార్టీ అధికారికంగా అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు, సోలాపూర్‌కు చెందిన మరో సంస్థ కూడా ఇదే తరహా పేరు కోసం దరఖాస్తు చేసుకోవడంతో ఈ ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారింది.ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం అందిన అన్ని అభ్యంతరాలను, వాటికి లభించిన వివరణలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. రాజకీయ పార్టీల పేర్లు, గుర్తుల నిబంధనలకు అనుగుణంగా, ఓటర్లలో ఎలాంటి అయోమయం లేకుండా చూసేందుకు సమీక్ష నిర్వహించిన తర్వాతే ఈసీ తన తుది నిర్ణయాన్ని ప్రకటించనుంది.

## రాముడి గుడిలోనే దొంగతనమా?



**మొదటిపేజీ తరువాయి -** రామాలయ ట్రస్ట్ వారి పరిధిలోనే నడుస్తున్నా... ఈ దొంగతనం జరిగిందని ఆయన అన్నారు. ఈ చోరీపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా స్పందించకపోవడం దారుణమన్నారు. ఇన్నేళ్లుగా రాముడి పేరును కేవలం రాజకీయాల కోసం, ఓటు బ్యాంక్ కోసమే బీజేపీ వాడుకుందని ఆయన విమర్శించారు. ఈ ఘటనపై విచారణకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎంపీల బృందాన్ని పంపనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అన్ని మతాలను గౌరవిస్తుందని, ఈ వైఫల్యానికి గాను ప్రధాని మోదీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న విమర్శలపై జగ్గారెడ్డి స్పందిస్తూ... కేటీఆర్ ప్రస్తుతం ఖాళీగా ఉండి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం గత ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ వంటి హామీలను అమలు చేస్తూ పాలనలో బిజీగా ఉన్నారని చెప్పారు. కేటీఆర్ ఎన్ని విమర్శలు చేసినా రేవంత్ రెడ్డే సీఎంగా కొనసాగుతారని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

## జింఖానా క్లబ్‌కు కేంద్రం షాక్: ఖాళీ చేయాలంటూ షోకాజ్ నోటీసు

**ఢిల్లీ జింఖానా క్లబ్‌ను ఖాళీ చేయించేందుకు కేంద్రం చర్యలు వేగవంతం**

**పబ్లిక్ ప్రెమిసెస్ చట్టం కింద క్లబ్‌కు షోకాజ్ నోటీసు జారీ**

**జూలై 7న విచారణకు హాజరుకావాలని ఎస్టేట్ అధికారి ఆదేశం**

**రక్షణ, ప్రజా భద్రత అవసరాల కోసం భూములు అవసరమంటున్న ప్రభుత్వం**

**లీజు రద్దు తర్వాత క్లబ్ ఆక్రమణ చట్టవిరుద్ధమని కేంద్రం వాదన**



దేశ రాజధానిలోని అత్యంత కీలకమైన ల్యూటెన్స్ జోన్‌లో ఉన్న ఢిల్లీ జింఖానా క్లబ్‌ను ఖాళీ చేయించే దిశగా కేంద్ర ప్రభుత్వం తన చర్యలను వేగవంతం చేసింది. సఫ్దర్‌జంగ్ రోడ్డులోని 27.3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంగణాన్ని స్వాధీనం చేసుకునేందుకు ‘పబ్లిక్ ప్రెమిసెస్ (ఎవిక్షన్) యాక్ట్, 1971’ కింద క్లబ్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి.ఈ వ్యవహారంలో ఎస్టేట్ అధికారి తాజాగా స్పందిస్తూ, క్లబ్‌ను ఎందుకు ఖాళీ చేయించకూడదో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఇందు కోసం జూలై 7వ తేదీ మధ్యాహ్నం 2:30 గంటలకు విచారణకు హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు. క్లబ్ ప్రతినిధులు తమ వాదనలకు మద్దతుగా తగిన ఆధారాలను సమర్పించాలని, లేనిపక్షంలో ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.లీజు ఒప్పందాన్ని రద్దు చేసిన తర్వాత కూడా క్లబ్ ఈ ప్రాంగణంలో కొనసాగడం పూర్తిగా చట్టవిరుద్ధమని, అనధికారికమని కేంద్ర ప్రభుత్వం వాదిస్తోంది. ప్రధానమంత్రి నివాసంతో సహా అనేక వ్యూహాత్మక ప్రాంతాలకు సమీపంలో ఉన్న ఈ భూమిని రక్షణ రంగ మౌలిక సదుపాయాలు, ప్రజా భద్రత, పరిపాలనా అవసరాలు మరియు ఇతర ప్రజా ప్రయోజన ప్రాజెక్టుల కోసం వినియోగించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.1928 నాటి లీజు ఒప్పందం ప్రకారం ఈ క్లబ్ ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తోంది. అయితే, ఒప్పందంలోని క్లాజ్ 4 ప్రకారం, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే పూర్తి హక్కు ప్రభుత్వానికి ఉంటుంది. ఈ నిబంధనను పురస్కరించుకునే కేంద్రం ప్రస్తుతం కఠిన చర్యలు చేపట్టింది. కాగా, క్లబ్ నిర్వహణలో అవకతవకలు జరిగాయని, సుమారు రూ. 47 నుంచి 48 కోట్ల వరకు అద్దె బకాయిలు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే గత మే నెలలో ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను క్లబ్ యాజమాన్యం ఢిల్లీ హైకోర్టులో సవాలు చేయగా, ప్రస్తుతం ఆ కేసు విచారణలో ఉంది.

# శెహభాష్.. లోకేశ్

**మొదటిపేజీ తరువాయి -** అనంతరం ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.కార్యక్రమం ముగిశాక, రాష్ట్రపతికి వీడ్కోలు పలికేందుకు మంత్రి లోకేశ్ హెలికాప్టర్ వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా లోకేశ్‌ను తన వద్దకు పిలిచిన రాష్ట్రపతి, విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న మార్పులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థి కేంద్రంగా సాగుతున్న ఈ సంస్కరణలు వారికి బంగారు భవిష్యత్తును అందిస్తాయని అన్నారు.అంతకుముందు స్నాతకోత్సవంలో మంత్రి లోకేశ్ చేసిన ప్రసంగం యువతలో స్ఫూర్తి నింపేలా సాగిందని రాష్ట్రపతి కొనియాడారు. పట్టభద్రులకు మంచి సందేశం ఇచ్చారని అభినందించారు. ఏపీ విద్యా విధానాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు లోకేశ్ కృషి చేస్తున్న విషయం తెలిసిందే.

## ‘మావిగన్ వర్సెస్ అమరావతి’.. చూసుకుందాం

**మొదటిపేజీ తరువాయి -** ఆయన అన్నారు. మావిగన్ ప్రతిపాదనకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. మావిగన్ కు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకి ఓటు వేస్తారని చెప్పారు. ఈ రెండు రాజధానుల్లో ప్రజల మద్దతు దేనికి ఎక్కువగా ఉందో వచ్చే ఎన్నికల్లో తేలిపోతుందని అన్నారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.‘జగన్ అమరావతికి వ్యతిరేకం’ అంటూ కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తాను అమరావతికి వ్యతిరేకం కాదని చెప్పారు. అమరావతి పేరుతో చంద్రబాబు సాగిస్తున్న స్కామ్‌లను, అవినీతిని మాత్రమే తాను ప్రశ్నిస్తున్నానని చెప్పారు. అవినీతి లేని రాజధాని కావాలనేదే తన ఆకాంక్ష అని, అందుకే ఈ మావిగన్ ప్రతిపాదనను తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈ సరికొత్త ప్రతిపాదనకు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకే ఓటు వేస్తారని, వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలో కూడా మావిగన్ ను చేరుస్తామని స్పష్టం చేశారు.

## వాట్సాప్ కొత్త ఫీచర్‌పై కేంద్రం ఆందోళన.. మోసాలకు ఆస్కారం!

**మొదటిపేజీ తరువాయి -** తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టినట్లు బుధవారం వెలువడిన పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.వాట్సాప్ ఈ యూజర్‌నేమ్ ఫీచర్‌ను జూన్ 29న ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేసింది. దీనివల్ల వినియోగదారులు తమ ఫోన్ నంబర్లను బహిర్గతం చేయకుండానే, కేవలం యూజర్‌నేమ్ ద్వారా ఇతరులతో సంభాషించే అవకాశం ఉంటుంది. ఇది వినియోగదారుల గోప్యతను మరింత మెరుగుపరుస్తుందని, ముఖ్యంగా స్పామ్ కాల్స్, సిమ్-స్వాపింగ్ వంటి ముప్పుల నుంచి రక్షణ కల్పిస్తుందని వాట్సాప్ పేర్కొంది. ప్రముఖులు, ప్రభుత్వ సంస్థల పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించకుండా ఉండేందుకు కొన్ని పేర్లను ముందస్తుగా రిజర్వ్ చేసినట్లు కూడా సంస్థ వెల్లడించింది.అయితే, ఈ ఫీచర్‌పై ప్రభుత్వ వర్గాలు పలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నాయి. 50 కోట్లకు పైగా వినియోగదారులతో వాట్సాప్‌కు భారత్ అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న నేపథ్యంలో, ఈ మార్పులపై ఆందోళన నెలకొంది. మోసగాళ్లు బ్యాంకులు, పాపులర్ బ్రాండ్లు లేదా ప్రముఖుల పేర్లను పోలిన యూజర్‌నేమ్‌లను సృష్టించి సామాన్యులను మోసగించే ప్రమాదం ఉందని అధికారులు విశ్లేషిస్తున్నారు. “ఈ అంశంలో భద్రతా పరమైన జాగ్రత్తలు తీసుకోవాల్సింది వాట్సాప్ యాజమాన్యమే” అని ఓ అధికారి స్పష్టం చేశారు.గతంలో పరీక్షల పేపర్ల లీకేజీ ఉదంతాల్లో టెలిగ్రామ్‌పై కేంద్రం కఠిన చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. అదే తరహాలో, యూజర్‌నేమ్ ఫీచర్ దుర్వినియోగాన్ని అరికట్టడంలో విఫలమైతే వాట్సాప్ మాతృసంస్థ మెటాకు నోటీసులు జారీ చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం ఈ ఫీచర్‌కు సంబంధించిన భద్రతా ప్రమాణాలను నిశితంగా సమీక్షిస్తోంది. వినియోగదారుల గోప్యత మరియు సైబర్ భద్రత మధ్య సమతుల్యత సాధించే వరకూ ఈ విషయంలో ఉత్కంఠ కొనసాగే అవకాశం ఉంది.

## మూడెకరాల రైతులకు శుభవార్త

**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణలో వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా పెట్టుబడి సాయం పంపిణీ రెండో రోజూ కొనసాగింది. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మూడెకరాల వరకు భూమి ఉన్న రైతులందరి బ్యాంకు ఖాతాల్లోకి బుధవారం నిధులను డీబీటీ విధానంలో నేరుగా జమ చేసింది.ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా 10.68 లక్షల మంది రైతులకు రూ.1,590.02 కోట్ల పెట్టుబడి సాయం అందనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటి వరకు రైతు భరోసా కింద 54.96 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి మొత్తం రూ.4,072.04 కోట్ల నిధులను విజయవంతంగా బదిలీ చేసినట్లు తెలిపింది. వానాకాలం సాగు ప్రారంభమైన వేళ ఎరువులు, విత్తనాల కొనుగోలుకు ఈ సాయం ఉపయోగపడుతుండటంతో రైతులు సాగు పనులను వేగవంతం చేస్తున్నారు.

## ఏఐతో అనుసంధానం, ఆ శాఖల్లో లీకులు లేకుండా చూడండి

**మొదటిపేజీ తరువాయి -** నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందేనని ఆదేశించారు. ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు.

## సినిమా హాళ్లలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి: జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి



ఒంగోలు,**జులై 01.అక్షర టైమ్స్ :** సినిమా థియెటర్స్ లో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ, లైసెన్సుల రెన్యువల్‌కు అవసరమైన అనుమతులతో పాటు ప్రేక్షకులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, సినిమా థియెటర్స్ యాజమాన్యాలకు సూచించారు.బుధవారం ఒంగోలు కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, సంబంధిత శాఖల అధికారులు, సినిమా థియెటర్స్ యాజమాన్యాల ప్రతినిధులతో సమావేశమై, జిల్లాలోని సినిమా థియెటర్స్ నిర్వహణ, లైసెన్సుల రెన్యువల్, భద్రతా ప్రమాణాల అమలు, ప్రేక్షకులకు మెరుగైన సౌకర్యాల కల్పన తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి మాట్లాడుతూ, సినిమా హాళ్లలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అగ్నిమాపక, విద్యుత్, భవన భద్రత, పారిశుద్ధ్యం తదితర అంశాల్లో నిర్దేశించిన ప్రమాణాలను అమలు చేయాలని ఆదేశించారు. లైసెన్సుల రెన్యువల్‌కు సంబంధించిన దరఖాస్తులను సకాలంలో సమర్పించి, అవసరమైన అనుమతులు, ధ్రువపత్రాలు పూర్తి స్థాయిలో అందజేయాలని సినిమా హాల్ యాజమాన్యాలకు సూచించారు. ప్రేక్షకులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి సినిమా థియెటర్స్ యాజమాన్యం బాధ్యత అని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, అగ్నిమాపక పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆమోదిత చిత్రాలను (2 నిమిషాలు) సినిమా థియెటర్స్ లో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా లో మొత్తం 41 సినిమా థియెటర్స్ వుండగా, అందులో 30 సినిమా థియెటర్స్ నడుపబడుచున్నవని, వీటికి సంబంధించి ప్రభుత్వ అనుమతులు, లైసెన్సుల రెన్యువల్, పారిశుధ్య నిర్వహణ, భద్రతా ప్రమాణాల అమలు, ప్రేక్షకులకు మెరుగైన సౌకర్యాల కల్పన తదితర అంశాలను పరిశీలించేలా రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ఒంగోలు ఆర్డిఓ చంద్రశేఖర్ నాయుడు, కలెక్టరేట్ పరిపాలనాధికారి సాయి, జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లు, తహసిల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు, సినిమా థియెటర్స్ యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.




## వైద్యులకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు: డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి




దర్శి,**జులై 01.అక్షర టైమ్స్ :** వైద్యం అనేది కేవలం ఒక వృత్తి కాదుడ ప్రాణాలను కాపాడే ఓ మహాశక్తి, మానవత్వానికి ప్రతిరూపం. ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా నిరంతరం సేవలందిస్తున్న వైద్యులందరికీ జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా దర్శి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పవిత్రమైన వైద్య వృత్తిలో భాగమైనందుకు నేను ఎంతో గర్వంగా, సంతోషంగా భావిస్తున్నాను అని ఆమె అన్నారు.

## కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం

### టిడిపి కార్యకర్త కుటుంబ సభ్యులకు రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కు పంపిణీ

### డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



దర్శి,**జులై 01.అక్షర టైమ్స్ :** తాళ్లూరు మండలం, కొర్రపాటివారిపాలెం గ్రామం లో టిడిపి కార్యకర్త కొర్రపాటి ఆంజనేయులు ఇటీవల ఆక్సిడెంట్ కారణం గా మరణించగా బుధవారం వారి నివాసానికి దర్శి టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వెళ్లి ఆంజనేయులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, కుటంబసభ్యులను ఓదార్చారు. తదుపరి ఆంజనేయులు టిడిపి సభ్యత్వం తీసుకున్నందున తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి మంజూరైన రూ. 5లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కు వారి కుటుంబ సభ్యులకు అందజేసినారు. రక్త సంబంధం లేకపోయినా కుటుంబ సభ్యుల్లా పార్టీ కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్న కార్యకర్తలందరికీ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తెలియజేసారు. ఈ కార్యక్రమం లో కొర్రపాటివారి పాలెం టిడిపి నాయకులు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి గొల్లపూడి వేణు, కోటా చిరంజీవి, కొర్రపాటి రామయ్య తదితరులు ఉన్నారు.

## వీబీజీ రామ్ జీ పై అధికారులతో మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి స్వామి సమీక్ష



ఒంగోలు,**జులై 01.అక్షర టైమ్స్ :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ స్థానంలో కేంద్రం ప్రవేశపెట్టిన వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్) పథకం రాష్ట్రంలో రేపటి అమలు చేయనున్న నేపథ్యంలో సంబంధిత అధికారులతో మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి సమావేశం నిర్వహించారు. తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో బుధవారం జిల్లా డ్వామా అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించి జిల్లాలో వీబీ జీ రామ్ జీ అమలుపై చర్చించారు. పాత ఉపాధి హామీ పథకంలో ఉన్న 100 రోజుల పనిని, వీబీ జీ రామ్ జీ కింద 125 రోజులకు పెంచడం శుభ పరిణామం అన్నారు. 125 రోజులు పని దినాలు ప్రజలు వినియోగించుకునేలా చూడాలన్నారు. వీబీ జీ రామ్ జీ కింద అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందించి గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి పేదలకు మేలు జరిగేలా కృషి చేయాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు.

## కనీస వేతనాలు, పిఎఫ్ లు అమలు చేయాలని అంగన్వాడీల డిమాండ్



గిద్దలూరు,**జులై 01.అక్షర టైమ్స్ :** ఈనెల 10వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ రేట్ల ముందు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించనున్నట్లు అంగన్వాడీ యూనియన్ సంఘాలు తెలిపాయి. కనీస వేతనాలను ఇవ్వాలని పిఎఫ్ ఈఎస్ఐ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని హెల్పర్ల ప్రమోషన్ ఐదు సంవత్సరాల సీనియార్టీని తక్షణమే రద్దు చేయాలని పెండింగ్ లో ఉన్న మినీ సెంటర్లను మెయిన్ సెంటర్ లుగా చేయాలని కోరుతూ ఈనెల 10వ తేదీ మార్కాపురం కలెక్టర్ రేట్ ఆఫీసు నందు ధర్నా చేస్తున్నట్టు అంగన్వాడి యూనియన్ సంఘాలు తెలిపాయి. అనంతరం గిద్దలూరు లోని ఐసిడిఎస్ కార్యాలయం లో అంగన్వాడీ యూనియన్ సంఘాలు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సంఘాల అధ్యక్షులు, ఆయాలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో నలుగురు నిందితుల అరెస్ట్: దర్శి డి.ఎస్.పి. బాల మురళి

### దర్శి,సిఐ. రామారావు, కురిచేడు ఎస్సై కోటయ్య ని అభినందించిన ఎస్పీ, డి.ఎస్.పి.




దర్శి,**జులై 01.అక్షర టైమ్స్ :** ప్రకాశం జిల్లా, దొనకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 29వ తేదీన మార్కాపురం గోల్డ్ లోన్ ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్న యర్రంశెట్టి వెంకట సుబ్బయ్యపై గుర్తు తెలియని వ్యక్తులు కారం పొడి చల్లి అతని వద్ద ఉన్న నగదు బ్యాగ్‌ను దొంగిలించి పరారైనారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొనకొండ పోలీస్ స్టేషన్‌లో దొంగతనం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినారు. దర్యాప్తులో భాగంగా ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, దర్శి డీఎస్పీ బాల మురళీకృష్ణ పర్యవేక్షణలో, దర్శి సీఐ శ్రీ వై. రామారావు ఆధ్వర్యంలో, కురిచేడు ఎస్సై కోటయ్య మరియు సిబ్బంది త్వరితగతిన కేసును చేదించి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకోవడం జరిగింది. నందిగాం రవీంద్ర బాబు (రవీంద్ర) (27) బోయిళ్లపల్లి గ్రామం, యర్రగొండపాలెం మండలం, మార్కాపురం జిల్లా. దండేబోయిన హరీష్ (30) బోయిళ్లపల్లి గ్రామం, యర్రగొండపాలెం మండలం, మార్కాపురం జిల్లా. నందిగాం చిన్న బాబు (24) బోయిళ్లపల్లి గ్రామం, యర్రగొండపాలెం మండలం, మార్కాపురం జిల్లా. బడిపాటి వెంకట నవీన్ (నవీన్) (22) పుల్లలచెరువు గ్రామం మరియు మండలం, మార్కాపురం జిల్లా. నిందితులు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ముందస్తు ప్రణాళిక రూపొందించి, దానిలో భాగంగ గోల్డ్ లోన్ పేరుతో బాధితుడు అయిన యర్రంశెట్టి వెంకట సుబ్బయ్య ను సంప్రదించారు. దొనకొండలో బంగారం తాకట్టు పెట్టామని, దానిని విడిపించి బాధితుడి వద్ద ఎక్కువ మొత్తంలో లోన్ తీసుకుంటామని నమ్మించి బాధితుడిని దొనకొండకు రప్పించారు. పథకం ప్రకారం నిందితులు అద్దెకు తీసుకున్న ఏపీ 39 జేఎన్7866 నంబరు గల కారులో దొనకొండకు చేరుకున్నారు. బాధితుడు దొనకొండకు వచ్చిన తరువాత అతనితో ఫోన్‌లో మాట్లాడి, కొద్దిసేపటిలో వస్తామని చెప్పి మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. అనంతరం బాధితుడు తిరిగి మార్కాపురం వెళ్తున్న మార్గంలో మల్లంపేట గ్రామం సమీపంలో ఒకే వెళ్లేసరికి ముద్దాయిలు వెంకటసుబ్బయ్య పై కారం పొడి చల్లి, అతని వద్ద ఉన్న నగదు బ్యాగ్‌ను లాక్కొని పరారయ్యారు. బ్యాగ్‌లో ఉన్న రూ. 2,30,000/- నగదును నిందితులు పంచుకుని, కొంత మొత్తాన్ని కారు అద్దె మరియు ఇతర ఖర్చులకు వాడుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ. 2,00,000/- నగదు మరియు దొంగతనానికి ఉపయోగించిన టయోటా ఎటియోస్ కారును పోలీసులు స్వాధీనం చేసుకొని వారిని దర్శి న్యాయస్థానంలో హాజరు పరచడం జరిగింది. చాకచక్యంగా నలుగురు నిందితులను పట్టుకుని కేసును త్వరితగతిన ఛేదించి, నగదు రికవరీ చేసినందుకు దర్శి సీఐ వై. రామారావుని, కురిచేడు ఎస్సై కోటయ్య ని, హెడ్ కానిస్టేబుల్ రంగనాయకుల్ని మరియు దొనకొండ పోలీసు సిబ్బంది నాయకు, విజయ్ , చెన్నకేశవులు, గిరి లను ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ అభినందించారు.

## సామాజిక పించన్ల పంపిణీకి ఏటా రూ.33 కోట్లు పైగా ఖర్చు చేస్తున్నాం: మంత్రి గొట్టిపాటి





ఒంగోలు/అద్దంకి**జులై 01.అక్షర టైమ్స్ :** రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా, అద్దంకి నియోజకవర్గంలోని కొమ్మినేనివారిపాలెంలో బుధవారం నాడు సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా 65 లక్షల మందికి సామాజిక భద్రత పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ. 33 వేల కోట్లు వెచ్చిస్తోందన్నారు. దేశంలోనే ఇంత భారీ స్థాయిలో సంక్షేమానికి నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వం మరొకటి లేదని పేర్కొన్నారు. అర్హులందరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. మరోవైపు స్పౌజ్ పింఛన్ల మంజూరును కూడా ప్రభుత్వం నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తోందని చెప్పారు. పర్యటనలో భాగంగా గ్రామంలో రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం గర్భిణీలకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మరింత మెరుగు పరిచే లక్ష్యంతో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎలక్ట్రిక్ స్టవ్‌లను అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమంతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అందించే ప్రతి పథకం పారదర్శకంగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

## జీఎస్టీ ప్రజలపై భారం కాదు

### సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ అరుణ్ రిచర్డ్

**గుంటూరు,జులై 01.అక్షర టైమ్స్ :** జీఎస్టీ అనేది ప్రజలపై భారం కాదని, అది మన సామూహిక భవిష్యత్ కోసం చేసే పెట్టుబడి అని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ అరుణ్ రిచర్డ్ అన్నారు. మంగళవారం రింగ్ రోడ్డు లోని శుభం కన్వెన్షన్ హాలు లో జరిగిన తొమ్మిదవ జీఎస్టీ దినోత్సవ వేడుకలో ఆయన ముఖ్య అతిథి గా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కమిషనర్ అరుణ్ రిచర్డ్ మాట్లాడుతూ..ప్రతి పన్ను చెల్లింపు దేశ మౌలిక సదుపాయాలు, వైద్యం, విద్య మరియు ప్రభుత్వ సేవల మెరుగుదలకు దోహద పడుతుందని తెలిపారు. పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలందించడం, వారి సమస్యల పరిష్కారం, స్వచ్ఛందంగా పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించడం మరియు వ్యాపార అభివృద్ధికి తోడ్పడేలా సాంకేతికను వినియోగించుకోవడంలో గుంటూరు కమిషనరేట్ జీఎస్టీ బృందం నిరంతరం కృషి చేస్తుందని వివరించారు. ' సుగమ కర్ వ్యవస్థ, సశక్త భరత్ ' ( సరళమైన పన్ను వ్యవస్థ, శక్తివంతమైన భారతం ) అనే ఇతివృత్తం తో ఈ ఏడాది జీఎస్టీ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. పన్ను చెల్లింపుదారులకు పారదర్శకమైన, సాంకేతికత తో కూడిన అనుకూలమైన పన్ను పరిపాలన అందించాలనే ప్రభుత్వ నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. భారతదేశపు అత్యంత పరివర్తనాత్మక ఆర్థిక సంస్కరణలలో వస్తు సేవల పన్ను అగ్రగామి గా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులు భాస్కరరెడ్డి వేమిరెడ్డి, విజయవాడ కస్టమ్స్ ప్రివెంటివ్ కమిషనర్ ఆర్. కె. రామన్, గుంటూరు రైల్వే డివిజన్ మేనేజర్ సుదేశ్న సేన్, సెంట్రల్ జీఎస్టీ అప్పీల్ కమిషనర్ దేవేష్ గుప్తా, సీనియర్ అధికారులు, సిబ్బంది, వాణిజ్య మరియు పారిశ్రామిక ప్రతినిధులు, పన్ను నిపుణులు, ఇతర వాటదారులు పాల్గొన్నారు. సరళమైన, పారదర్శకమైన మరియు సమర్థవంతమైన జీఎస్టీ వ్యవస్థ ద్వారా ' వికసిత్ భారత్ ' లక్ష్య సాధనకు తమ వంతు కృషి చేస్తామని వారు పునరుద్ఘటించారు.






## ప్రతి ఇంటికి అభివృద్ధి సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి,జులై 01.అక్షర టైమ్స్ :** ముండ్లమూరు మండలం, చంద్రగిరి గ్రామంలో గురువారం సచివాలయ సిబ్బందితో కలిసి దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. డాక్టర్ లక్ష్మి తో పాటు నియోజకవర్గ పరిశీలకులు రాఘవేంద్ర , టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ స్థానిక నాయకులు ఉన్నారు. ప్రతి అవ్వ తాత ఆనందాన్ని చూడగలిగానని ఇది నాకెంతో గర్వంగా ఉందని డాక్టర్ లక్ష్మి అన్నారు. ప్రతి ఇంట్లో ముఖ్యమంత్రి చంద్రన్న పెద్ద దిక్కు వలె క్రమం తప్పకుండా ఒకటవ తేదీ పెన్షన్ పంపిస్తూ వారి బాగోగులు తెలుసుకునే మహాభాగ్యం మా కలగడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి కుటుంబంలో ఒకటో తారీకు వచ్చిందంటే పండుగ కనిపిస్తుంది అటు ఉద్యోగులకు ఇటు పెన్షన్ దారులకు ఇచ్చిన మాట ప్రకారం క్రమం తప్పకుండా ఒకటవ తేదీ పంపిణీ చేయడం మన ప్రభుత్వానికే సాధ్యమైంది అన్నారు. గత ఐదేళ్లు ఆంధ్ర రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది సంక్షోభం నుండి సంక్షేమ వైపు నడుస్తూ పాలనను గాడిలో పెడుతూ అనుభవం ఉన్న మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు నిరంతరం ప్రజల కోసం ప్రజల బాగోగుల కోసం పరితపిస్తున్న విషయం చూస్తున్నాము. విద్యా, ఉద్యోగం, ఉపాధి లక్ష్యంగా అభివృద్ధి సంక్షేమం ప్రతి ఇంటికి చేరాలన్న దిశగా ఉండేలా కూటమి పాలన సాగింది. అదే స్ఫూర్తితో మనం దర్శి నియోజకవర్గంలో ఇంటింటికి వెళ్లి ప్రజల బాగోగులు తెలుసుకుంటున్నాం. ప్రజల సంక్షేమ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాం. గత ఐదేళ్లు ఎలాంటి అభివృద్ధి లేకుండా దర్శి లో కుల, మతాల, వర్గ వైశ్యామ్యాలతో వెనుకబడింది. అందుకు భిన్నంగా రాజకీయాలకతీతంగా అభివృద్ధి ఎజెండాగా మీ సేవకురాలుగా ప్రతి ఇంటికి వస్తున్నాను. మీ అండగా ఉంటున్నాను. మీకు భరోసానందిస్తున్నాను. ప్రజలు కూడా మంచి పాలనను దీవించండి, కూటమి ప్రభుత్వ నాలుగు కాలాలపాటు అధికారంలో ఉంటే మన భవిష్యత్తు, మన పిల్లల భవిష్యత్తు ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని భావించి కూటమి ప్రభుత్వాన్ని ఆదరించండి, అభిమానించండి దీవించండి అని అన్నాడు. ఈ కార్యక్రమంలో ముండ్లమూరు, తాళ్లూరు మండలాల టిడిపి అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, మేడగం వెంకటేశ్వర రెడ్డి, టిడిపి నాయకులు సోమేపల్లి శ్రీను, రాష్ట్ర నాటక కలపరిషత్ డైరెక్ట్ బొమ్మిరెడ్డి ఓబుల్ రెడ్డి, మనం రమేష్, చంద్రగిరి గ్రామ స్థానిక నాయకులు, బచ్చు సుబ్బారెడ్డి, చంద్రగిరి గురవారెడ్డి, అంబటి శ్రీనివాస రెడ్డి, తిరుపతిరెడ్డి, ముండ్లమూరు మండలం లోని కూటమి శ్రేణులు పాల్గొన్నారు



## ఏపీ ఆర్ చౌదరికి శుభాకాంక్షలు తెలిపిన గోకవరం మండల బిజెపి నాయకులు





గోకవరం,**జులై 01.అక్షర టైమ్స్ :** రాజానగరం నియోజకవర్గ బిజెపి సీనియర్ నాయకులు ఎపిఆర్ చౌదరి బిజెపి అనకాపల్లి జిల్లా ఇన్చార్జిగా ఎన్నికైన సందర్భంగా గోకవరం మండలం బిజెపి నాయకులు బుధవారం ఉదయం కోరుకొండ లోని బిజెపి కార్యాలయంలో ఏపీ ఆర్ చౌదరిని కలిసి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు మట్ట మంగరాజు ,గోకవరం మండల బిజెపి అధ్యక్షులు ఇనకోటి బాపన్న దొర, బిజెపి సీనియర్ నాయకుడు ఉంగరాల ఆదివిష్ణు తదితరులు మాట్లాడుతూ ఏపీ ఆర్ చౌదరి నాలుగు దశాబ్దాలుగా బిజెపిలో కొనసాగుతూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరము అహోరాత్రులు పని చేస్తూ నియోజకవర్గంలో బిజెపి అభివృద్ధికి అలుపెరుగని కృషి చేస్తున్నారని ఆయన సేవలను గుర్తించే రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివి ఎన్ మాధవ్ ఏపీ ఆర్ చౌదరిని అనకాపల్లి జిల్లా బిజెపి ఇన్చార్జిగా నియమించడం జరిగిందని చౌదరి పార్టీకి చేసిన సేవలను రాష్ట్ర నాయకత్వం గుర్తించిందని, ఇదేవిధంగా చౌదరి మరెన్నో ఉన్నత పదవులు చేపట్టి ప్రజా సేవ చేయాలని ఆయన నాయకత్వంలో రాజనగరం నియోజకవర్గంలో బిజెపి మరింత బలోపేతం అవ్వాలని గతంలో ఆయన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు గా పనిచేసి జిల్లాలో బిజెపి పటిష్టతకు కృషి చేశారని అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ సత్తి వెంకటరెడ్డి , జిల్లా బిజెపి కార్యదర్శి కోనా వెంకట సురేష్, మండల బిజెపి ప్రధాన కార్యదర్శి ముప్పిడి నాగేశ్వరరావు, కోశాధికారి ముమ్మిడివరపు రామకృష్ణ, ఇటీవల బీజేపీలో చేరిన యువ నాయకుడు క్రీ సూర్య మణికంఠ, తామర్ల రాంబాబు, తొట్టా మల్లేశ్వరరావు, ముక్కా శ్రీను కోరుకొండ మండల బిజెపి అధ్యక్షులు అడపా సుధీర్ కుమార్, బిజెపి సీనియర్ నాయకులు తగరంపూడి గణపతి, జాజుల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

## గంజాయి,డ్రగ్స్‌పై ఎస్సై లక్ష్మీకాంతం అవగాహన కార్యక్రమం

**ప్రత్తిపాడు బస్ స్టాండ్‌లో కాలేజీ విద్యార్థులకు పోలీసుల సూచనలు**



ఏలేశ్వరం,**జులై 01.అక్షర టైమ్స్ :** కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు,పెద్దాపురం డిఎస్పీ ఏబిజీ తిలక్ సూచనలతో ప్రత్తిపాడు సీఐ బి సూర్య అప్పారావు పర్యవేక్షణలో ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం బుధవారం బస్ స్టాండ్ వద్ద కాలేజీ విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు.గంజాయి,డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.అలాగే గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా,వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.సమాచారం అందించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1972,ఎమర్జెన్సీ 112తో పాటు ఎస్సై ప్రత్తిపాడు 9440796570, సీఐ ప్రత్తిపాడు 9440796530 నంబర్లను వినియోగించాలని తెలిపారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్సై స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఈవ్ టీజింగ్‌పై కూడా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ అడిషనల్ ఎస్సై రమణమూర్తి,సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దనాపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

**వృద్ధులకు స్వయంగా పెన్షన్ అందజేసిన ఎంపీపీ**

**యూనిట్ ఇన్చార్జి సమావేశంలో పాల్గొని నాయకులకు దిశానిర్దేశం**

**ఎస్సీ సామాజిక భవన నిర్మాణ పనులు పరిశీలించిన ఎంపీపీ బుజ్జి**



ఏలేశ్వరం,**జులై 01.అక్షర టైమ్స్ :** ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) పాల్గొన్నారు.జూలై నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పెన్షన్లను అందజేశారు.అలాగే తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు ప్రతి మొదటి బుధవారం నిర్వహించే యూనిట్ ఇంచార్జ్ సమావేశం మైరాల కనకారావు అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో ఎంపీపీ బుజ్జి పాల్గొని నాయకులతో కలిసి పలు విషయాలు చర్చించారు.అలాగే గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఎస్సీ సామాజిక భవన పనులను ఎంపీపీ పరిశీలించి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు.ఈ కార్యక్రమాల్లో ఎంపిడిఓ రామరాజు వర్మ,నాయకులు సుంకర సత్యనారాయణ,గ్రామ ప్రజాప్రతినిధులు,సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక దృష్టి కార్యక్రమంలో పాల్గొన్న గుంటి శేఖర్



పటాన్చెరువు,**జులై 01.అక్షర టైమ్స్ :** -ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఓటరు కీలకమని, ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజలందరూ బాధ్యతగా పాల్గొనాలని సామాజిక కార్యకర్త గుంటి శేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ సర్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు మరియు సవరణలు చేసుకోవడానికి ఇది సరైన సమయమని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి యువత తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని, అలాగే చిరునామా మార్పులు లేదా ఇతర సవరణలు ఏవైనా ఉంటే తక్షణమే సరిచూసుకోవాలని సూచించారు. ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన గొప్ప వరం అని, దీనిని వినియోగించుకోవడం ద్వారానే మన ప్రాంత అభివృద్ధికి బాటలు వేసే ప్రజా ప్రతినిధులను ఎన్నుకోగలమని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, రాజకీయ నాయకులు, మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను పాటిస్తూ, సకాలంలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

## శేరిలింగంపల్లిలో 'తెలంగాణ రక్షణ సేన'లోకి భారీగా చేరికలు

**రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయన్న సీనియర్ నాయకులు వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్**



శేరిలింగంపల్లి,**జులై 01.అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.ఈరన్న శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రానున్న రోజుల్లో తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీలోకి మరిన్ని భారీ చేరికలు ఉంటాయని నియోజకవర్గ సీనియర్ నాయకులు వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ స్పష్టం చేశారు. బుధవారం చందానగర్ డివిజన్‌కు చెందిన వివిధ పార్టీల నుండి తెలంగాణ ఉద్యమకారుడు షేక్ అస్లాం సమక్షంలో, వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో దాదాపు 25 మంది యువకులు, నాయకులు తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ చంద్రశేఖర్ ప్రసాద్ పార్టీ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శేరిలింగంపల్లి నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీకి ప్రజలు, యువత నుండి అపూర్వ మద్దతు లభిస్తోందని అన్నారు. నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లావణ్య బండారి, విష్ణు చారీ, సందీప్ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో మహేష్, ప్రదీప్, రాజశేఖర్, రాజు, వజీర్, కుమార్, శ్రీనివాస్, రాజ్, సతీష్, రంగా, షేక్ వలి, హగంరాజు, బాల, తేజ, జిలాని, మురళి, రాకేష్, సలాం, మధు, వర్మ, సంతోష్ తదితరులు ఉన్నారు.

## ఏలేశ్వరంలో సత్యదేవుని కళ్యాణ వైభవం ఆరో రోజు భక్తులకు భారీ అన్నదానం

**తొలి రోజు ఎమ్మెల్యే సత్యప్రభ పట్టు వస్త్రాల సమర్పణ**

**ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే సత్యప్రభ చర్యలు**

**మూది నారాయణ స్వామి,బొదిరెడ్డి గోపి**

**అన్నవరం ఈవో,చైర్మన్ లకు సత్యదీక్ష ప్రచార కర్త**

**నల్లమల్ల కృష్ణబాబు కృతజ్ఞతలు**





ఏలేశ్వరం,**జులై 01.అక్షర టైమ్స్ :** ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దత్తత ఆలయమైన కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో అనంతలక్ష్మి సమేత శ్రీ సత్యనారాయణ స్వామివారి కళ్యాణ మహోత్సవాలు ఐదు రోజులపాటు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగాయి.మహోత్సవాల తొలి రోజు స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఉత్సవాల అనంతరం ఆరో రోజు అన్నవరం దేవస్థానం నుంచి తీసుకొచ్చిన అన్నప్రసాదాన్ని సుమారు రెండు వేల మంది భక్తులకు వితరణ చేశారు.అన్నవరం దేవస్థానం వేద పండితులు,ఆలయ అర్చకుడు పొన్నూరు సత్యనారాయణ ఆచార్యులు ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలు, వేద ఆశీర్వచనాలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పట్టణ నాయకులు మూది నారాయణస్వామి,బొదిరెడ్డి గోపి మాట్లాడుతూ వరుసగా ఆరో ఏడాది అన్నప్రసాద ఏర్పాట్లు చేసిన అన్నవరం దేవస్థానం ఈవో సూర్య చక్రధర్ రావు,చైర్మన్ ఐ వి రోహిత్ కు కృతజ్ఞతలు తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సహకారంతో ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని,ఆలయం వెనుక భాగంలో కళ్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు మాట్లాడుతూ ఆరు సంవత్సరాల క్రితం స్వామివారు కలలో దర్శనమిచ్చి కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేయాలని సూచించారని తెలిపారు.ఆ విషయాన్ని దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అప్పటి నుంచి ప్రతి ఏడాది కళ్యాణోత్సవాల అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమం విజయవంతానికి సహకరించిన భక్తులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ,శ్రీ అనంతలక్ష్మి శ్రీ సత్యనారాయణ స్వామివారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ అన్నదాన కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది మహిళా సేవకులు పాల్గొని సేవలందించారు.

## హైదరాబాద్‌లో ఐదు ప్రత్యేక రిటైల్ దుకాణాలను ప్రారంభించిన యూరోగ్రిప్ టైర్స్



శేరిలింగంపల్లి,**జులై 01.అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.ఈరన్న టీవీఎస్ శ్రీచక్ర లిమిటెడ్‌కు చెందిన భారతదేశ ప్రముఖ ద్విచక్ర, త్రిచక్ర వాహన టైర్ బ్రాండ్ 'యూరోగ్రిప్ టైర్స్' తెలంగాణలోని హైదరాబాద్‌లో ఐదు కొత్త ప్రత్యేక రిటైల్ దుకాణాలను ప్రారంభించినట్లు ప్రకటించింది. వీటిలో మూడు స్టోర్లను హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ పి సి ఎల్) సహకారంతో వారి వ్యాపార భాగస్వామి ద్వారా ఫ్రాంచైజీ పద్ధతిలో ఏర్పాటు చేశారు. ఈ నూతన స్టోర్ల ప్రారంభం, భారతదేశవ్యాప్తంగా యూరోగ్రిప్ టైర్స్ తన రిటైల్ విస్తరణ వ్యూహాన్ని కొనసాగిస్తున్నట్లు సూచిస్తోంది. వీటి ద్వారా సంస్థ తన మార్కెట్ ఉనికిని మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు, కస్టమర్లకు సమగ్ర టైర్, ద్విచక్ర వాహన సంరక్షణ సేవలను ఒకే చోట అందించాలనే నిబద్ధతను చాటుతోంది. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని కొండాపూర్ కూన్ హ్యుందాయ్ షోరూమ్ పక్కన ఏర్పాటు చేసిన ప్రధాన స్టోర్‌ను యూరోగ్రిప్-మిలాన్ డిజైన్ హెడ్ మిస్టర్ సిల్వియో మొంటానారి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా టీవీఎస్ శ్రీచక్ర లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మిస్టర్ టి.కె.రవి మాట్లాడుతూ, అధిక నాణ్యత గల ప్రోడక్టులు, సేవలను కస్టమర్లకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనాల వినియోగం అధికంగా ఉన్న హైదరాబాద్, యూరోగ్రిప్ టైర్స్‌కు అత్యంత ప్రాధాన్య మార్కెట్లలో ఒకటి అని, ఈ ఐదు ప్రత్యేక రిటైల్ దుకాణాల ప్రారంభం తమ విస్తరణ ప్రయాణంలో మరో కీలక మైలురాయి అని పేర్కొన్నారు. ఈ కొత్త దుకాణాల ద్వారా, రైడర్లు నిపుణుల మద్దతు, సేవలతో పాటు తమ పూర్తి టైర్ పోర్ట్‌ఫోలియోను సౌకర్యవంతంగా యాక్సెస్ చేయవచ్చని ఆయన వివరించారు. కొత్తగా ప్రారంభించిన ఈ దుకాణాల్లో యూరోగ్రిప్ టైర్స్‌కు చెందిన పూర్తి స్థాయి ప్రోడక్టుల శ్రేణి వివిధ నమూనాలు, సైజుల్లో అందుబాటులో ఉంటుంది. స్కూటర్లు, కమ్యూటర్ మోటార్‌సైకిళ్లు, మిడ్-రేంజ్ పెర్ఫార్మెన్స్ బైకులు, అడ్వెంచర్ టూరింగ్ మోటార్‌సైకిళ్లు, సూపర్‌బైకులు వంటి వివిధ వాహన విభాగాల అవసరాలను తీర్చే ఉత్పత్తులతో పాటు, విభిన్న రకాల ద్విచక్ర వాహనాలకు అనుకూలమైన ట్యూబ్‌ల విస్తృత శ్రేణి కూడా కస్టమర్లకు లభిస్తుంది. ప్రోడక్టు శ్రేణితో పాటు, ఈ ప్రత్యేక రిటైల్ దుకాణాలలో ప్రొఫెషనల్ టైర్ ఫిట్‌మెంట్, టైర్ నిర్వహణ సేవలు, పంక్చర్ మరమ్మతులు, ఎయిర్ ప్రెజర్ తనిఖీలు మరియు వారంటీ-సంబంధిత ప్రశ్నలకు తగిన సహాయం లభిస్తుంది. భారతదేశంలోని కీలక మార్కెట్లలో బ్రాండెడ్ రిటైల్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసే వ్యూహంలో భాగంగానే ఈ విస్తరణ చేపట్టినట్లు కంపెనీ తెలిపింది. హైదరాబాద్, పానిపట్, బహ్రాయిచ్, లూధియానా, ఢిల్లీ మరియు అలప్పుజాలో ఇటీవల ప్రారంభించిన కొత్త దుకాణాలతో పాటు, యూరోగ్రిప్ టైర్స్ ఇప్పటికే చెన్నై, మైసూరు, పాట్నా, ఫరూఖాబాద్, అహ్మదాబాద్ మరియు రాజ్‌కోట్ నగరాల్లో కూడా రిటైల్ ఎక్స్‌పీరియన్స్ దుకాణాలను నిర్వహిస్తోంది. హైదరాబాద్ నగరంలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఐదు స్టోర్లు కొండాపూర్ (కూన్ హ్యుందాయ్ షో రూమ్ పక్కన), ఈస్ట్ మారేడు పల్లి, ఎల్ బి నగర్ చింతలకుంట, శేరిలింగంపల్లి గోపనపల్లి మరియు గుల్ మోహర్ పార్క్ కాలనీలలో కస్టమర్ల సేవలకై సిద్ధంగా ఉన్నాయని యాజమాన్యం ప్రకటించింది.

## కొండాపూర్‌లో మురుగునీటి కష్టాలకు చెక్

**పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్**

**ప్రేమ్ నగర్ 'బి' విభాగంలో వేగంగా సాగుతున్న**

**భూగర్భ మురుగునీటి కాలువల నిర్మాణం**





కొండాపూర్,**జులై 01.అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.ఈరన్న కొండాపూర్ పరిధిలోని ప్రేమ్ నగర్ 'బి' విభాగంలో స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఇక్కడ కొత్తగా చేపట్టిన భూగర్భ మురుగునీటి కాలువల (డ్రైనేజీ) నిర్మాణ పనులను కొండాపూర్ మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ బుధవారం స్థానిక నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యతపై అధికారులకు పలు సూచనలు చేశారు.

**తక్షణమే స్పందించిన హమీద్ పటేల్.. రంగంలోకి జలమండలి అధికారులు**

గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో పాత కాలువలు పూర్తిగా దెబ్బతినడంతో, మురుగునీరు రహదారులపైకి పొంగిపొర్లుతూ స్థానికులు, బాటసారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ సమస్యను స్థానికులు షేక్ హమీద్ పటేల్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన తక్షణమే స్పందించారు. హైదరాబాద్ మహానగర నీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల సంస్థ (జలమండలి) ఉన్నతాధికారులను స్వయంగా రప్పించి, సమస్య తీవ్రతను వివరించారు."పాత కాలువల వ్యవస్థ పూర్తిగా విఫలం కావడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి, తక్షణమే నూతన భూగర్భ మురుగునీటి కాలువల ప్రతిపాదనలు సిద్ధం చేయించాం. నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించాం. ఈ పనులు వేగంగా పూర్తయితే ఈ ప్రాంతంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది." షేక్ హమీద్ పటేల్, మాజీ కార్పొరేటర్

**కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు:**

**పనుల పరిశీలనలో భాగంగా హమీద్ పటేల్‌తో పాటు సీనియర్ నాయకులు:**

యన్. రూపారెడ్డి డా. రమేష్ గౌడ్ వెంకటేష్ యాదవ్ మంగమ్మ శ్రీనివాస్ రెడ్డి అబేద్ అలీ సంపత్, శేఖర్, రాము, చందు తదితరులు పాల్గొన్నారు. పనులు వేగంగా జరుగుతుండటంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సంబురంగా రామంతాపూర్ పెద్ద చెరువులో అభివృద్ధి పనులు

**సుందరీకరణ, అభివృద్ధి పనులకు రూ.19 కోట్లు మంజూరు**

**అతి త్వరలోనే రామంతాపూర్ చిన్న చెరువు, నాచారం పటేల్ కుంట చెరువులలోనూ అభివృద్ధి పనులకు శ్రీకారం**

**ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి**



అతి త్వరలోనే మిగతా రెండు చెరువులలోనూ పనులు: పరమేశ్వర్ రెడ్డి




ఉప్పల్,**జులై 01.అక్షర టైమ్స్ :** ప్రతినిధి హరి మోహన్ రెడ్డి ఉప్పల్ పరిధిలోని రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులను బుధవారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు స్థానికులతో కలిసి పర్యవేక్షించారు. రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులకు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి రూ.19 కోట్ల నిధులను మంజూరు చేయించారు.స్థానికులతో కలిసి పరమేశ్వర్ రెడ్డి పనులను పర్యవేక్షించి మాట్లాడారు. ఈ పనులతో ఏ ఒక్కరికీ నష్టం వాటిల్లదన్నారు. బతుకమ్మ కొలను, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ , తదితర ఏర్పాట్లను చేయనున్నట్టుగా చెప్పారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని చెరువుల అభివృద్ధికి నిధులను మంజూరు చేయించడంతో పాటు పనులు సైతం ప్రారంభం అయినట్టుగా ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. నాచారం లోని పటేల్ కుంట చెరువు, రామంతాపూర్ లోని చిన్న చెరువుల అభివృద్ధి, సుందరికరణ పనులకు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారువాటిల్లోనూ అభివృద్ధి పనులను ఇదే తరహాలో అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో హబ్సిగూడ, రామంతాపూర్, వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# ఓటర్ల జాబితా సవరణపై బూత్ స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

**కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**

**పటాన్ చెరు,జులై 01.అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు నమోదు, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బూత్ స్థాయి ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ పిలుపునిచ్చారు. పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రామచంద్రపురంలోని బాలాజీ గార్డెన్స్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక ముసాయిదా సవరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు.





**పారదర్శకతకు ప్రాధాన్యత:**

ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా మార్పులు చేర్పులు జరగాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించే క్రమంలో పొరపాట్లు జరగకుండా పర్యవేక్షించాల్సిన బాధ్యత బూత్ స్థాయి ఏజెంట్లపైనే ఉందని స్పష్టం చేశారు. మరణించిన వారి పేర్లు తొలగించడం, ఒకే పేరుతో రెండు చోట్ల ఉన్న బోగస్ ఓట్లను గుర్తించి జాబితాను ప్రక్షాళన చేయాలని దిశానిర్దేశం చేశారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చొరవ చూపాలని కోరారు.

**క్షేత్రస్థాయిలో సమన్వయం:**

నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రక్రియపై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన ఉండాలని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో ప్రతి బూత్ పరిధిలో జాబితా పక్కాగా ఉండాలని, ఇందులో బూత్ స్థాయి ఏజెంట్ల పాత్ర కీలకమని వివరించారు. బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ, అర్హులైన వారు ఓటు హక్కు కోల్పోకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజల్లో కూడా ఈ ప్రక్రియపై విస్తృత ప్రచారం కల్పించి, తమ ఓటు వివరాలను సరిచూసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన సదస్సులో దరఖాస్తుల భర్తీ, ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ దరఖాస్తుల పరిశీలన, తదితర సాంకేతిక అంశాలపై ప్రతినిధులకు సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డి, పిసిసి కోఆర్డినేటర్ వెన్నెల, పిసిసి వైస్ ప్రెసిడెంట్ గాలి అనిల్ కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు కాట సుధా, కార్పొరేటర్ పుష్ప నగేష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

# నాగారంలో ఎస్ఐఆర్‌పై రాజకీయ పార్టీల ఏకాభిప్రాయం

**అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం**

**నాగారం జులై 01.అక్షర టైమ్స్ :** ప్రతినిధి గోపగాని పాండు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర మండలం నాగారం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ఆల్‌పార్టీ సమావేశానికి బీఆర్ఎస్ నాయకులు హాజరై, ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ) కార్యక్రమంపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని, దానిని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓటరు జాబితా కచ్చితత్వాన్ని పెంపొందించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలని కోరారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటరు జాబితాలో ఉన్నవారు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను ఒకసారి పరిశీలించి అవసరమైతే వెంటనే సవరణలు చేయించుకోవాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి కుటుంబం అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, విశ్వసనీయంగా ఉండాలంటే ఓటరు జాబితా తప్పులులేకుండా ఉండడం అత్యంత అవసరమని నాయకులు అన్నారు. రాజకీయ భేదాలు పక్కనబెట్టి ప్రజల ఓటు హక్కును కాపాడే విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఒకే వేదికపైకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా ఎన్నికల సంఘం సూచించిన విధివిధానాలను పాటిస్తూ తమ వివరాలను సరిచూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో గూడూరు ఆంజనేయులు గౌడ్, తేల శ్రీధర్, కౌకుట్ల అనంతరెడ్డి, ఎండీ పాషా, అక్బర్ బాషా, లింగం, నిమ్మల శ్రీనివాస్, రమేష్, కొట్టే దయాకర్, ఓం ప్రకాష్, సంపత్, విఘ్నేష్, మల్లేష్తో పాటు మాజీ వార్డ్ సభ్యుడు చిన్నం రాజు సాయినాథ్ గౌడ్ పాల్గొన్నారు. సమావేశంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన పెంపొందించుకుని, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంకల్పించారు.




# ఉప్పల్ భూ పోరాటానికి మద్దాలి సాయికుమార్ శంఖారావం

**మద్దాలి సాయికుమార్ నేతృత్వంలో భూ పోరాట పోస్టర్ ఆవిష్కరణ**

**ఉప్పల్ బగాయిత్ భూ పోరాటానికి కుషాయిగూడ నుంచి శంఖారావం**

**మౌలాలి,జులై 01.అక్షర టైమ్స్ :** ప్రతినిధి గోపగాని పాండు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, ఎస్ రావు నగర్ పరిధిలో జరిగిన పత్రికా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలైన 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల గౌరవ పింఛన్, ప్రత్యేక గుర్తింపు కార్డులను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 2న హైదరాబాద్ ఉప్పల్ బగాయిత్‌లో నిర్వహించనున్న భూ పోరాటాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తూ కుషాయిగూడలో భూ పోరాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మౌలాలి డివిజన్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు మద్దాలి సాయి కుమార్ మాట్లాడుతూ, ఉద్యమకారులు, అమరవీరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, వారికి ఇచ్చిన హామీలు ఇంకా అమలు కాకపోవడం విచారకరమన్నారు. ఉద్యమకారుల న్యాయమైన హక్కుల సాధన కోసం చేపట్టనున్న భూ పోరాటానికి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, తెలంగాణ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మౌలాలి డివిజన్‌కు చెందిన మద్దాలి సాయికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు (హైదరాబాద్ ఇన్‌చార్జ్) మల్లారి అనిల్ కుమార్, జేఏసీ చైర్మన్ రామగిరి ప్రకాష్, జేఏసీ నాయకుడు బీరకాయల మధుసూదన్, తెలంగాణ రక్షణ సేన పార్టీ స్టేట్ అబ్జర్వర్ తాండ్ర శ్రీనివాసరావు, మల్కాజిగిరి ఇన్‌చార్జ్ ప్రశాంత్ చారి, రాష్ట్ర నాయకురాళ్లు జాముల స్రవంతి, కుసుమ రజిత, టీఆర్ఎస్ నాయకురాలు ఆవుల జ్యోత్స్న, తెలంగాణ సీనియర్ నాయకుడు కొనుగుంట్ల నవీన్ యాదవ్, టీఆర్ఎస్ నాయకురాలు గీత సింధు, టీఆర్ఎస్ నాయకుడు బుర్కా సందీప్‌తో పాటు పలువురు ఉద్యమకారులు, నాయకులు పాల్గొన్నారు.





# దేశంలో 25 శాతం పెట్టుబడులను ఆంధ్రప్రదేశ్ ఆకర్షించింది

**సీఎం చంద్రబాబు**


**మాదనపాలెంలో గ్లోబల్ పార్ట్స్ సెంటర్-2.0**

**ప్లాంట్‌కు సీఎం భూమిపూజ**

**నూతన ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 వేల మందికి ఉపాధి అవకాశాలు**

**రెండేళ్లలో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం**

దేశానికి వచ్చే మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులను ఆంధ్రప్రదేశ్ ఆకర్షించిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలోనూ ఏపీ అగ్రస్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న అతిపెద్ద తీరం, పోర్టులు పరిశ్రమలకు ఎంతగానో కలిసి వస్తాయన్నారు. అన్ని పోర్టులను అనుసంధానిస్తూ రవాణాకు ఆటంకం లేకుండా చేస్తున్నామన్నారు. తిరుపతి జిల్లా మాదనపాలెంలో ఏర్పాటు చేసిన హీరో మోటోకార్ప్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు చంద్రబాబు మాదనపాలెంలో హీరో మోటోకార్ప్ 'గ్లోబల్ పార్ట్స్ సెంటర్' ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. ఈ నూతన ప్లాంట్‌ను హీరో మోటోకార్ప్ సంస్థ రూ.750 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మిస్తుంది. దీని ద్వారా స్థానికంగా సుమారు నాలుగు వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. శ్రీసిటీలో రూ.1,600 కోట్ల పెట్టుబడితో నిర్మించిన ప్లాంట్ ఇప్పటికే విజయవంతంగా నడుస్తోంది. అక్కడ ఏటా 1.2 మిలియన్ల నుంచి 1.5 మిలియన్ల ద్విచక్ర వాహనాలను సంస్థ ఉత్పత్తి చేస్తోంది. కార్యకలాపాల విస్తరణ కోసం భవిష్యత్‌లో రూ.3,200 కోట్లు వెచ్చించాలనే ప్రణాళికతో హీరో సంస్థ ఉంది.'బ్రిజ్ మోహన్‌లాల్ పారిశ్రామికవేత్త మాత్రమే కాదు జాతి నిర్మాత. బ్రిజ్ మోహన్‌లాల్‌తో నాకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఎక్కడ అవకాశాలు ఉంటే వాటిని అందిపుచ్చుకునేందుకు నేను ప్రయత్నిస్తా. హీరో మోటార్స్ మరో రాష్ట్రంలో ఏర్పాటు విషయం నాకు తెలిసింది. 2018లో హీరో మోటార్స్‌కు శంకుస్థాపన చేస్తే అద్భుతంగా రాణిస్తోంది. ద్విచక్రవాహనాల్లో అతిపెద్ద వినియోగదారులు గల సంస్థ హీరో మోటార్స్. ప్రపంచవ్యాప్తంగా హీరో మోటార్స్‌కు 130 మిలియన్ల వినియోగదారులు. 3 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలు ఇక్కడ తయారయ్యాయని' చంద్రబాబు పేర్కొన్నారు."భవిష్యత్ ఎలక్ట్రిక్ వాహనాలదే అనడంలో సందేహం లేదు. ఏపీని మించిన లాజిస్టిక్స్ హబ్ లేదనే విధంగా తయారవుతోంది. రూ.750 కోట్లతో గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేశాం. ఎలక్ట్రిక్ వాహనాల్లో రూ.3200 కోట్ల పెట్టుబడులకు కట్టుబడి ఉన్నారు. గ్రీన్ ఎనర్జీలో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ ఒకడుగు ముందుంది. అతిపెద్ద తీరం, పోర్టులు ఆంధ్రప్రదేశ్‌కు కలిసి వచ్చే అంశం. అన్ని పోర్టులను అనుసంధానిస్తూ రవాణాకు ఆటంకం లేకుండా చేస్తున్నాం. రాష్ట్రానికి కొత్త విమానాశ్రయాలు వస్తున్నాయి.పరిశ్రమలకు అవసరమైనంత నీళ్లు, విద్యుత్ అందించేందుకు సిద్ధం." - చంద్రబాబు, ముఖ్యమంత్రి'ఏపీలో విన్ విన్ విధానంలో భూసేకరణ చేపడుతున్నాం. భూములు ఇచ్చిన రైతు కూడా సమానంగా లబ్ధి పొందాలి. రెండేళ్లలో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. ప్రస్తుతం పరిశ్రమల్లో 40 శాతం మంది మహిళలు పనిచేస్తుండటం గర్వకారణం. పెట్టుబడుల ద్వారా 20 లక్షల మందికి ఉపాధి కల్పన. ఇప్పటికే రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులు పురోగతిలో ఉన్నాయి. ఏపీతో పెట్టుబడులకు ముందుకు వస్తే సొంత ప్రాజెక్టులుగా ముందుకు తీసుకెళ్తాం. అమరావతిలో డిసెంబర్ నాటికి క్వాంటం కంప్యూటర్స్ ఏర్పాటు కానుంది. క్వాంటం కంప్యూటర్లలో ప్రపంచంలో ఆరో స్థానంలో నిలుస్తాం. రెండేళ్లలో అమరావతిలో క్వాంటం కంప్యూటర్లు తయారవుతాయని' చంద్రబాబు వెల్లడించారు."తిరుపతిలో మహిళా పోలీసులకు 63 వాహనాలు ఇస్తున్నారు. హీరో సంస్థ ఉన్న ప్రాంతంలో కొన్ని కుటుంబాలను దత్తత తీసుకోవాలి. పీ-4లో భాగంగా ఇప్పటికే లక్ష కుటుంబాలను దత్తత తీసుకున్నారు. మార్గదర్శి-బంగారు కుటుంబం మధ్య సమన్వయం చేస్తూ ముందుకెళ్తాం. ధనికులు, పేదల మధ్య అంతరాన్ని పూడ్చేందుకు ముందుకు రావాలి. లక్ష మంది డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రమోట్ చేశాం. ఈ ఏడాది 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలుగా చేస్తాం. డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాల్లో 99.9 శాతం తిరిగి చెల్లిస్తున్నారు." - చంద్రబాబు, ముఖ్యమంత్రి




## గూడెం మహిపాల్ రెడ్డి, తుమ్మల పాండురంగారెడ్డిల చేతుల మీదుగా కొత్త సంస్థల ప్రారంభం





**అమీన్‌పూర్,జులై 01.అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ పర్యావరణ కాలుష్య నివారణకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పటాన్‌చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. బీరంగూడ పరిధిలోని కృష్ణారెడ్డి పేట, ఇక్రిశాట్ కాలనీలలో ఏర్పాటు చేసిన బ్యాటరీ వాహనాల విక్రయ కేంద్రం, హోటల్‌ను బుధవారం మహిపాల్ రెడ్డి, అమీన్‌పూర్ పురపాలక సంఘం మాజీ అధ్యక్షుడు తుమ్మల పాండురంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, కాలుష్య రహిత బ్యాటరీ వాహనాలను వాడాలని కోరారు. కొత్తగా ప్రారంభమైన ఈ సంస్థలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షుడు నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ, అమీన్‌పూర్ ప్రాంతంలో ఆధునిక వ్యాపార సంస్థలు రావడం శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షుడు నరసింహ గౌడ్, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కొల్లూరి చంద్రకళ గోపాల్, పార్టీ సీనియర్ నాయకులు నందారం రమేష్ గౌడ్, ఐలాపూర్ నర్సింగ్ రావు, స్థానిక నాయకులు, వ్యాపారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## శ్రీ చక్రిపురంలో శ్రీవారి బ్రహ్మోత్సవ వైభవం

**బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే బండారు ప్రత్యేక పూజలు**



**చర్లపల్లి,జులై 01.అక్షర టైమ్స్ :** ప్రతినిధి గోపగాని పాండు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చర్లపల్లి డివిజన్ పరిధిలోని శ్రీచక్రిపురం కాలనీలోని శ్రీ శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే శ్రీ బండారు లక్ష్మారెడ్డి ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, శ్రీచక్రిపురం శ్రీ వెంకటేశ్వర స్వామివారి కృప ప్రజలందరిపై ఉండాలని, రాష్ట్రంలో సుఖశాంతులు, సస్యశ్యామలం నెలకొనాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో చక్రిపురం కాలనీ అధ్యక్షులు గడ్డల పాండు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి సోమసాని అశోక్, చర్లపల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు నేమూరి మహేష్ గౌడ్, గౌరవాధ్యక్షులు రాఘవరెడ్డి, సలహాదారులు రణధీర్ రెడ్డి, పుట్ట సహదేవ్ గౌడ్, కమిటీ సభ్యులు రవీందర్ గంగపుత్ర, వెంకటేష్ గుప్తా, అలాగే కాలనీ వాసులు నరసింహారెడ్డి, వెంకట్ రెడ్డి, వినోద్ నాయి, మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించబడగా, భక్తుల రద్దీతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని సౌకర్యాలు కల్పించి, కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు.

## కావలి నగర వనం అధికారికంగా ప్రారంభం

**పిల్లలు,పెద్దలు, ప్రకృతి ప్రియులకు పిలుపునిచ్చిన**

**సోషల్ ఫారెస్ట్ డి.ఎఫ్. ఓ నాగార్జున రెడ్డి**





**కావలి,జులై 01.అక్షర టైమ్స్ :** కావలి పట్టణం ఉదయగిరి జాతీయ రహదారి ప్రక్కన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నగర వనం ను ఫారెస్ట్ అధికారులు అధికారికంగా బుధవారం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం 18 నగర వనం లను అధికారికంగా ప్రారంభం చేస్తున్న క్రమంలో ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మాత్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా పాల్గొని వర్చువల్ గా ప్రారంభించారు. అనంతరం కావలి పట్టణంలోని నగర వనం ను కావలి సబ్ డి.ఎఫ్.ఓ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు నుంచి ముఖ్య అతిథిగా విచ్చేసిన సోషల్ ఫారెస్ట్ డి.ఎఫ్.ఓ నాగార్జున రెడ్డి ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి పట్టణ ప్రజలు, పిల్లలు, ప్రకృతి ప్రియులకు ఈ నగర వనం ఎంతో సౌలభ్యంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ముందుగా విచ్చేసిన విద్యార్థులు, మహిళల చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టి ఆహ్లాదకర వాతావరణంలో ఆనందించారు. అనంతరం లైవ్ ద్వారా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి, అధికారులు మాట్లాడగా వీక్షించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు కావలి ఎఫ్.ఆర్.ఓ సౌజన్య, డి.ఆర్.ఓ జి చెన్నయ్య, ఎఫ్.ఎస్.ఓ లు ఆర్ సుమన్, సుభహాని, ఎఫ్.డి.ఓ అనిల్, తదితర సిబ్బంది, వి.ఎస్ లు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా బచ్చపన్ స్కూల్ లో డాక్టర్స్ డే వేడుకలు..





**పొదలకూరు,జులై 01.అక్షర టైమ్స్ :** రిపోర్టర్ ఆనంద్ పొదలకూరు మెయిన్ రోడ్ బచ్చపన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ లెక్కల. సురేష్ రెడ్డి, మాట్లాడుతూ సమాజంలో ప్రాణదాతలైన వైద్యుల సేవలను స్మరించుకుంటూ, పొదలకూరు మండలంలో బచ్చపన్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు జాతీయ వైద్యుల దినోత్సవాన్ని డాక్టర్స్ డేని అత్యంత ఉత్సాహంగా, ఘనంగా జరుపుకున్నామన్నారు. అదేవిదంగా సమాజం పట్ల బాధ్యతను, నిస్వార్థ సేవలందించే వృత్తుల పట్ల గౌరవాన్ని చిన్నప్పటి నుండే విద్యార్థులకు అలవాటు చేయాలనే సదుద్దేశంతో స్కూల్ యాజమాన్యం ఈ వినూత్న కార్యక్రమాన్ని ఏర్పాటెందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం బచపన్ స్కూల్ చిన్నారులు పొదలకూరు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. అహర్నిశలు ప్రజల ఆరోగ్య ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్, మాట్లాడుతూ రక్షణ కోసం పాటుపడుతున్న ప్రభుత్వ వైద్యులను స్వయంగా కలిసి, వారికి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశామన్నారు. విద్యార్థులు తమ చిట్టి చేతులతో తయారు చేసిన అందమైన గ్రీటింగ్ కార్డులను, పూల బొకేలను డాక్టర్లకు బహూకరించి వారి సేవలకు కృతజ్ఞతలు తెలియజేశారు. చిన్నారులు తమ చేతులతో స్వయంగా గ్రీటింగ్ కార్డులు తయారు చేసి తీసుకురావడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఇంత చిన్న వయస్సులోనే పిల్లల్లో ఇలాంటి సృజనాత్మకతను, సామాజిక స్పృహను పెంపొందిస్తున్న బచపన్ స్కూల్ యాజమాన్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఆసుపత్రిలోని మరికొంతమంది వైద్యులను కూడా చిన్నారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలు అంతటి ప్రేమాభిమానాలతో తమకు గ్రీటింగ్ కార్డ్స్ ఇవ్వడం చూసి ఆ డాక్టర్లందరూ ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. చిన్నారుల నిష్కల్మషమైన నవ్వులు, ఆప్యాయత తమకు ఎంతో ఉత్సాహాన్ని, మానసిక తృప్తిని ఇచ్చాయని వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.

# యూట్యూబ్‌లో చూసి హత్య

**24 గంటల్లోనే కేసు ఛేదించిన కరీంనగర్ పోలీసులు**

**హత్య ఎలా చేయాలో యూట్యూబ్‌లో చూసి నేర్చుకున్న నిందితుడు**

**వివాహేతర సంబంధం, అవమానాలే హత్యకు కారణమని వెల్లడి**

**పీరీల పండుగ నుంచి వస్తుండగా ఇనుప రాడ్‌తో దాడి చేసి హత్య**

**నిందితుడి నుంచి మొబైల్ ఫోన్, హత్యకు వాడిన ఆయుధం స్వాధీనం**



తెలంగాణలోని కరీంనగర్‌లో దారుణ హత్యోదంతం చోటుచేసుకుంది. హత్య ఎలా చేయాలో యూట్యూబ్ వీడియోలలో చూసి, ఓ వ్యక్తిని అత్యంత కిరాతకంగా చంపిన నిందితుడిని పోలీసులు కేవలం 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. ఈ కేసులో బంగారపు మహేష్ (40) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.పోలీసుల కథనం ప్రకారం.. మృతుడు పైతరి మొగిలి (52) ఓ వివాహితపై అత్యాచార యత్నం కేసులో జైలుకు వెళ్లి ఇటీవల విడుదలయ్యాడు. అయితే, జైలు నుంచి వచ్చాక కూడా అతను తన పద్ధతి మార్చుకోలేదు. ఆ మహిళను వేధించడం కొనసాగించాడు. అదే మహిళతో వివాహేతర సంబంధం ఉన్న నిందితుడు మహేష్‌ను కూడా మొగిలి తరచూ అవమానించేవాడు. వారి సంబంధం గురించి చుట్టుపక్కల గ్రామాల్లో ప్రచారం చేస్తూ, మహేష్ పరువు తీస్తున్నాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య గొడవలు కూడా జరిగాయి.మొగిలి నుంచి ఎదురవుతున్న నిరంతర వేధింపులు, అవమానాలు భరించలేకపోయిన మహేష్, అతడిని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం యూట్యూబ్‌లో హత్యలు ఎలా చేయాలి, ఆయుధాలు ఎలా సిద్ధం చేసుకోవాలి వంటి వీడియోలు చూసి పక్కా ప్రణాళిక రచించాడు. హుజూరాబాద్ ఏసీపీ మాధవి తెలిపిన వివరాల ప్రకారం.. "శనివారం రాత్రి మడిపల్లి గ్రామంలో జరిగిన పీరీల పండుగకు హాజరై మొగిలి సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా, ఓ కల్వర్టు వద్ద కాపుకాచిన మహేష్ వెనుక నుంచి ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. తలపై పలుమార్లు బలంగా కొట్టి, అతను చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత ఇంటికి వెళ్లి, రక్తంతో తడిసిన బట్టలు మార్చుకుని పరారయ్యాడు" అని వివరించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా మహేష్‌ను ప్రశ్నించగా, తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. నిందితుడి నుంచి నేరానికి ఉపయోగించిన ఇనుప రాడ్, యూట్యూబ్ సెర్చ్ హిస్టరీ ఉన్న మొబైల్ ఫోన్, బైక్, హత్య సమయంలో ధరించిన దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి నేరాలకు పాల్పడకుండా నిందితుడిపై రౌడీ షీట్ తెరిచేందుకు కూడా జిల్లా పోలీసులు యోచిస్తున్నారు.

# వీడని చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ మిస్టరీ

**తుని పోలీసులు కీలక ప్రకటన**

**కాకినాడ జిల్లా తుని చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యంపై వీడని ఉత్కంఠ**

**పాప ఆచూకీ తెలిపిన వారికి రూ.లక్ష రివార్డు ప్రకటించిన పోలీసులు**

**చిన్నారి ఫొటోతో రాష్ట్రవ్యాప్తంగా వాల్‌పోస్టర్లు, కరపత్రాల పంపిణీ**

**25 రోజులుగా గాలిస్తున్నా లభించని చిన్నారి ఆనవాళ్లు**

**కిడ్నాప్ కోణంలో దర్యాప్తు చేసినా దొరకని ఆధారాలు**






కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ అగ్రహారానికి చెందిన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో మిస్టరీ 25 రోజులుగా కొనసాగుతూనే ఉంది. పాప ఆచూకీ కోసం పోలీసులు తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. చిన్నారి సమాచారం అందించిన వారికి రూ.లక్ష నగదు పారితోషికం ఇస్తామని ప్రకటించారు.ఈ మేరకు చిన్నారి ఫొటో, గుర్తింపు వివరాలతో కూడిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కాకినాడ జిల్లాతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో ఈ పోస్టర్లను అంటిస్తున్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని పోలీసులు హామీ ఇచ్చారు. పాప గురించి తెలిస్తే 9440796508, 9440796531, 9440796573 నంబర్లకు సమాచారం ఇవ్వాలని తుని పోలీసులు ప్రజలను కోరారు.చిన్నారి అదృశ్యమైనప్పటి నుంచి ఇప్పటివరకు 12 ప్రత్యేక పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. అటవీ ప్రాంతంతో పాటు సమీపంలోని వాగులు, వంకలను జల్లెడపట్టాయి. అయినా చిన్నారి ఆనవాళ్లు లభించలేదు. మరోవైపు, జీడిపిక్కలు ఏరేందుకు సమీప గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చేవారికి పాప వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. పాపను ఎవరైనా కిడ్నాప్ చేశారా అనే కోణంలోనూ దర్యాప్తు చేసినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. అడవి జంతువులు ఏమైనా దాడి చేశాయా అనే అనుమానంతో బొమ్మను, మాంసాన్ని సంఘటనా స్థలంలో ఉంచి చూసినా ఫలితం లేకుండా పోయింది.జూన్ 6వ తేదీ మధ్యాహ్నం 11.50 గంటల సమయంలో ఇంటి వద్ద ఆడుకుంటున్న జ్ఞానేశ్వరి కనిపించకుండా పోయింది. పాపతో పాటు వెళ్లిన వారి పెంపుడు శునకం కూడా అదృశ్యమైంది. కొన్ని రోజులకు ఆ శునకం తిరిగి ఇంటికి చేరినప్పటికీ, దాని ద్వారా పాప ఆచూకీ లభించలేదు. ఆ తర్వాత కొన్ని రోజులకే ఆ శునకం కూడా మృతి చెందింది.పాప కనిపించకుండా పోయిన రోజు, ఆ శునకం ఊరిలోని ప్రధాన రహదారిపై ఆందోళనగా తిరుగుతున్న దృశ్యాలు సమీపంలోని ఆలయ సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. కానీ, అది ఎటువైపు వెళ్లిందనే దానిపై స్పష్టత రాలేదు. దాదాపు నెల రోజులు కావస్తున్నా పాప ఆచూకీ లభించకపోవడంతో, ఇప్పుడు ప్రజల నుంచి అందే సమాచారంపైనే పోలీసులు ఆశలు పెట్టుకున్నారు.

# పోలీసులపై కత్తితో దాడికి యత్నం

**ఆత్మరక్షణ కోసం నిందితుడిపై పోలీసుల కాల్పులు**

**ఏపీకి చెందిన భూష్మి శ్రీకాంత్‌గా గుర్తింపు**

**నిందితుడిపై 10కి పైగా ఆస్తి, నేరాల కేసులు**

**హైదరాబాద్‌కు వెళ్లిన నల్గొండ సీసీఎస్ బృందం**

**చికిత్స అనంతరం నల్గొండకు తరలింపు**



ఓ వ్యక్తి గత కొంతకాలంగా నల్గొండ జిల్లా కేంద్రంతో పాటు ఇతర చోట్ల దొంగతనాలు చేస్తున్నాడు. అతన్ని పట్టుకునేందుకు నల్గొండ పోలీసులు హైదరాబాద్‌కు వెళ్లారు. అదుపులోకి తీసుకొనే క్రమంలో నిందితుడు పోలీసులపై దాడి చేసేందుకు ప్రయత్నం చేశారు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నిందితుడి కాలికి గాయమైంది.పోలీసుల కథనం ప్రకారం నిందితుడు ఏపీకి చెందిన భూష్మి శ్రీకాంత్‌పై పదికి పైగా ఆస్తి, నేరాల కేసులు ఉన్నాయని, నాలుగేళ్ల క్రితం ఏపీలో ఓ కానిస్టేబుల్‌ను హత్య చేసిన కేసు కూడా ఉన్నట్లు సమాచారం. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఈ క్రమంలో అతను హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం వచ్చింది. దీంతో సీసీఎస్ బృందం మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లింది. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల సమీపంలో అవుటర్ రింగ్ రోడ్డు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఫస్ట్ సర్వీస్ రింగ్ రోడ్డుపై సీసీఎస్ నల్గొండ పోలీసులు అనుమానంతో డీసీఎం వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఈ క్రమంలో నిందితుడు శ్రీకాంత్ తన వద్ద ఉన్న కత్తితో పోలీసులపై దాడికి ప్రయత్నించాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో శ్రీకాంత్ రెండు కాళ్లకు బుల్లెట్ గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.ప్రస్తుతం నిందితుడి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. అనంతరం సీసీఎస్ పోలీసులు శ్రీకాంత్‌ను నల్గొండకు తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. తమ కానిస్టేబుల్‌ను చంపేందుకు యత్నించాడని నిడమానూరు ఎస్ఐ ఫిర్యాదు చేశారు. దీంతో ఆదిభట్ల పీఎస్‌లో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ప్రస్తుతం పోలీసులు నిందితుడిపై ఉన్న పాత ఆస్తి నేరాల వివరాలను సేకరిస్తున్నారు.

# ఓర్చుకోలేక బీజేపీ నేతలు మూర్ఖపు విమర్శలు చేస్తున్నారు: మల్లు రవి

**తెలంగాణలో రాముడి ఆదర్శ పాలన సాగుతోందన్న మల్లు రవి**

**అయోధ్య రాముడి సొమ్మును బీజేపీ దిగమింగిందని ఆరోపణ**

**రాహుల్ ప్రధాని కావడం ఖాయమని ధీమా**



తెలంగాణలో సాగుతోంది రాముడి ఆదర్శ పాలన అని ఆ పార్టీ సీనియర్ నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. దేవుడి సొమ్మును కూడా దిగమింగిన బీజేపీకి ఇక పుట్టగతులుండవు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సర్వజన సంక్షేమమే ధ్యేయంగా దూసుకుపోతుంటే, ఓర్వలేక బీజేపీ నేతలు మూర్ఖపు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.తెలంగాణలో ఉనికి కోసం ఆరాటపడుతున్న బీజేపీ... దేశంలో అత్యంత అవినీతి, నియంతృత్వ ధోరణులతో ఒక 'రావణాసుర పాలన' సాగిస్తోందని మల్లు రవి ధ్వజమెత్తారు. ఇటీవల తెలంగాణలో పర్యటించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పర్యటన ఒక 'అట్టర్ ఫ్లాప్ షో' అని ఎద్దేవా చేశారు. ఇక్కడ కాంగ్రెస్‌ను గద్దె దించడం ఎవరి వల్లా కాదని, తెలంగాణ సమాజం మత విద్వేష రాజకీయాలను ఎన్నటికీ ఆదరించదని స్పష్టం చేశారు.అయోధ్య రాముడి పేరుతో 40 ఏళ్లుగా రాజకీయం చేస్తున్న బీజేపీ... చివరకు ఆ దేవుడి సొమ్మును కూడా వదలకుండా మింగేసిందని తీవ్ర ఆరోపణలు చేశారు. స్వయంగా యూపీలోని అయోధ్య వాసులే ఆ పార్టీ అవినీతిపై ఆగ్రహంతో ఉన్నారని, దేశంలో కమలం పార్టీకి కాలం చెల్లిందన్నారు. విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీకి రాబోయే సార్వత్రిక ఎన్నికలే చివరివని, త్వరలోనే దేశం 'బీజేపీ ముక్త్ భారత్' కాబోతుందని జోస్యం చెప్పారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీయడం, రాహుల్ గాంధీ ప్రధాని పీఠాన్ని అధిరోహించడం ఖాయమని మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి సెగలు

**రేవంత్ రెడ్డిపై రాజగోపాల్ రెడ్డి తీవ్ర విమర్శలు**

**యాదగిరిగుట్ట దేవస్థానం నూతన ట్రస్ట్ బోర్డు గురించి తనకు సమాచారం ఇవ్వలేదన్న రాజగోపాల్ రెడ్డి**

**ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని సీఎంపై విమర్శలు**

**కాంగ్రెస్ పార్టీలో అసలైన కాంగ్రెసోళ్లు ఎక్కడున్నారని ప్రశ్న**



యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు నూతన కార్యవర్గ ఏర్పాటుకు సంబంధించి తనకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదని సొంత కాంగ్రెస్ ప్రభుత్వంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆవేదన, అసంతృప్తి వ్యక్తం చేశారు. మునుగోడు నియోజకవర్గం యాదాద్రి జిల్లాలోనే ఉన్నప్పటికీ తనకు సమాచారం ఇవ్వలేదని విమర్శించారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు.ఇదే సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆయన నేరుగా విమర్శలు గుప్పించారు. రేవంత్‌కు షోఆఫ్స్ ఎక్కువయ్యాయని ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీనియర్ ఎమ్మెల్యేనైన తనను సంప్రదించి ఉంటే తన నియోజకవర్గం నుంచి ఒక సభ్యుడినైనా బోర్డులో చేర్పించుకునేవాడినని, కనీస ఇంగితజ్ఞానం లేకుండా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు.ప్రభుత్వ ఏకపక్ష పోకడలు నచ్చకనే నల్గొండలో జరిగిన ముఖ్యమంత్రి సభకు తాను వెళ్లలేదని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటున్నా తమకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. అసలు కాంగ్రెస్‌లో ఒరిజినల్ కాంగ్రెసోళ్లు ఎక్కడున్నారని, ఎక్కడెక్కడి నుంచో కొత్తవాళ్లు వచ్చి అంతా వాళ్లే నడుపుతున్నారని దుయ్యబట్టారు. సీనియర్లను ఎలా గౌరవించాలో కూడా తెలియడం లేదని, నాడు తెలంగాణ కోసం కొట్లాడిన ఒరిజినల్ లీడర్లు రోజురోజుకీ కనుమరుగవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఏపీ లిక్కర్ స్కామ్.. ముగ్గురు నిందితులను కస్టడీకి ఇవ్వాలంటూ ఈడీ పిటిషన్

**లిక్కర్ కుంభకోణం కేసుతో దర్యాప్తును వేగవంతం చేసిన ఈడీ**

**వాసుదేవరెడ్డి, రాజ్ కెశిరెడ్డి, సునీల్ కుమార్‌లను కస్టడీకి ఇవ్వాలంటూ ఈడీ పిటిషన్**

**కస్టడీపై నిర్ణయం తీసుకోనున్న కోర్టు**




ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ స్కామ్‌లో ప్రధాన నిందితులుగా ఉన్న వాసుదేవరెడ్డి, రాజ్ కెశిరెడ్డి, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ కుమార్‌లను ఏడు రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ ఈడీ అధికారులు కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.ఈ మద్యం రవాణా పాలసీ విధానంలో జరిగిన అక్రమాల వల్ల ప్రభుత్వ ఖజానాకు ఏకంగా రూ. 196.33 కోట్ల మేర గండిపడిందని ఈడీ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ భారీ కుంభకోణానికి సంబంధించిన మద్యం రవాణా విధానాలపై పూర్తిస్థాయి సాక్ష్యాధారాలు, కీలక పత్రాలు, టెండర్ల వివరాలను నిందితుల నుండి రాబట్టాల్సి ఉందని, అందుకే వారి కస్టడీ అవసరమని ఈడీ కోర్టుకు తెలిపింది. దీనిపై స్పందించిన ఈడీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి... ఈ పిటిషన్లపై కౌంటర్లు దాఖలు చేయాలని నిందితుల తరపు న్యాయవాదులను ఆదేశించారు. ఇరుపక్షాల ప్రాథమిక వాదనల అనంతరం కోర్టు తదుపరి విచారణను ఈరోజుకు వాయిదా వేసింది. ఈనాటి విచారణలో కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అనే ఆసక్తి సర్వత్ర నెలకొంది.

# గాదె సాయి కృష్ణ కస్టడీ డెత్ కేసులో మరో ఇద్దరు కానిస్టేబుళ్లు అరెస్ట్

**కేసులో మొత్తం అరెస్టుల సంఖ్య ఐదుకు చేరిక**

**ప్రధాన నిందితుడైన సీఐకి సహకరించారనే ఆరోపణలు**

**కస్టడీలో గాయాల వల్లే సాయి కృష్ణ మృతి చెందాడని నిర్ధారించిన సిట్**



విజయవాడలో సంచలనం సృష్టించిన గాదె సాయి కృష్ణ (25) కస్టడీ మృతి కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో తాజాగా మరో ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లను అరెస్ట్ చేసింది. దీంతో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య ఐదుకు చేరింది.కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుళ్లు బాబూరావు, సాంబయ్యలను సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కేసులో ఐదో నిందితుడిగా బాబూరావు, ఆరో నిందితుడిగా సాంబయ్య ఉన్నారు. వారిని రెండో ఏసీఎం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. బాబూరావును అవనిగడ్డ జైలుకు, సాంబయ్యను గన్నవరం జైలుకు తరలించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌హెచ్‌ఓ) ఎస్.ఎస్.వి.వి. నాగరాజుకు వీరిద్దరూ సహకరించారని ఆరోపణలు ఉన్నాయి.మే 6వ తేదీన పోలీసులు అదుపులోకి తీసుకున్న సాయి కృష్ణ అదృశ్యమయ్యాడు. లాకప్‌లో చిత్రహింసలకు గురిచేసి, కొట్టి చంపేశారని, ఆ తర్వాత మృతదేహాన్ని ఎలక్ట్రిక్ శ్మశానవాటికలో దహనం చేసి ఆధారాలు మాయం చేశారని అతని కుటుంబం ఆరోపిస్తోంది. సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు జూన్ 19న భారతీయ న్యాయ సంహిత కింద పోలీసులు కేసు నమోదు చేశారు.కస్టడీలో తీవ్ర గాయాల వల్లే సాయి కృష్ణ మరణించాడని సిట్ ఇప్పటికే కోర్టుకు నివేదించింది. అంతేకాకుండా పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజీని ఉద్దేశపూర్వకంగా తొలగించారని కూడా దర్యాప్తులో తేలింది. కొన్ని కేసులు, నాన్-బెయిలబుల్ వారెంట్లు ఉన్న సాయి కృష్ణను మార్కాపురంలో అదుపులోకి తీసుకుని, కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించినట్లు సిట్ పేర్కొంది.ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఇన్‌స్పెక్టర్ నాగరాజును సిట్ జూన్ 23న అరెస్ట్ చేయగా, కోర్టు అతనికి జులై 8 వరకు రిమాండ్ విధించింది. మరో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, నాని ఇప్పటికే పోలీసులకు లొంగిపోగా, వారిని కూడా ప్రభుత్వం సస్పెండ్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. ఐజీ ఎం. రవిప్రకాశ్ నేతృత్వంలోని సిట్ బృందం కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తోంది.

# ప్రైమ్ వీడియో కస్టమర్లకు అన్యాయం

**అమెజాన్‌ను కోర్టుకు ఈడ్చిన ఆస్ట్రేలియా ప్రభుత్వం**

**ప్రైమ్ వీడియోలో యాడ్స్ వేయడంపై ఆస్ట్రేలియాలో అమెజాన్‌పై కేసు**

**యాడ్స్ లేకుండా చూడాలంటే అదనపు డబ్బులు వసూలు చేయడంపై వివాదం**

**అన్యాయమైన ఒప్పంద నిబంధనలతో వినియోగదారులను మోసం చేసిందని ఆరోపణ**

**లక్షలాది మంది వార్షిక చందాదారులపై ఈ మార్పుల ప్రభావం పడిందని వెల్లడి**

**అమెజాన్‌పై భారీ జరిమానా, వినియోగదారులకు నష్టపరిహారం కోరుతున్న ఏసీసీసీ**




దిగ్గజ ఈ-కామర్స్, టెక్నాలజీ సంస్థ అమెజాన్ ఆస్ట్రేలియాలో తీవ్రమైన చట్టపరమైన ఆరోపణలు ఎదుర్కొంటోంది. తమ ప్రైమ్ వీడియో స్ట్రీమింగ్ సేవలో అకస్మాత్తుగా ప్రకటనలను ప్రవేశపెట్టి, వాటిని తొలగించుకోవాలంటే వినియోగదారుల నుంచి అదనపు రుసుము వసూలు చేయడంపై ఆ దేశ కాంపిటీషన్ వాచ్‌డాగ్ తీవ్రంగా స్పందించింది. వినియోగదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా, అన్యాయమైన ఒప్పంద నిబంధనలను చేర్చారంటూ ఆస్ట్రేలియన్ కాంపిటీషన్ అండ్ కన్స్యూమర్ కమిషన్ (ఏసీసీసీ) అమెజాన్‌పై ఫెడరల్ కోర్టులో దావా వేసింది.

**వివాదానికి కారణమేమిటి?**

ఈ వివాదం 2024లో అమెజాన్ తన ప్రైమ్ వీడియో సేవలో ప్రకటనలను చేర్చడంతో మొదలైంది. ఏసీసీసీ వాదన ప్రకారం.. అప్పటికే వార్షిక చందా చెల్లించిన లక్షలాది మంది సబ్‌స్క్రైబర్లు, ఎలాంటి ముందస్తు స్పష్టత లేకుండా యాడ్స్‌తో కూడిన సేవను పొందాల్సి వచ్చింది. ఎవరైనా ప్రకటనలు లేకుండా మునుపటిలా వీడియోలు చూడాలనుకుంటే, నెలకు అదనంగా 2.99 ఆస్ట్రేలియన్ డాలర్లు చెల్లించాలని అమెజాన్ షరతు విధించింది. ఏడాదికి 79 డాలర్లు చెల్లించి వార్షిక సభ్యత్వం తీసుకున్న వారికి ఇది తీవ్ర అన్యాయమని ఏసీసీసీ ఆరోపించింది. ఈ మార్పులు చేసిన సమయంలో ఇప్పటికే 8.5 లక్షల మందికి పైగా ఆస్ట్రేలియన్ వినియోగదారులు వార్షిక చందా చెల్లించి ఉన్నారు. అదనపు రుసుము చెల్లించని వారికి, వారు డబ్బు చెల్లించిన సేవలో కోత విధించినట్లు అయ్యిందని (డౌన్‌గ్రేడ్) ఏసీసీసీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఏసీసీసీ చైర్ గినా కాస్-గాట్లిబ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. "అమెజాన్ తన వార్షిక ప్రైమ్ ఒప్పందాలలో అనేక అన్యాయమైన నిబంధనలను చేర్చింది. వాటిని అడ్డం పెట్టుకునే ప్రైమ్ వీడియోలో ప్రకటనలను ప్రవేశపెట్టింది" అని వివరించారు.

**కేవలం యాడ్స్ సమస్యే కాదు**

ఈ కేసు కేవలం యాడ్స్ ప్రదర్శనకు మాత్రమే పరిమితం కాలేదు. అమెజాన్ తన ఒప్పందాలలో చేర్చిన ఐదు కీలక నిబంధనలను ఏసీసీసీ లక్ష్యంగా చేసుకుంది. ఈ నిబంధనలు సబ్‌స్క్రైబర్లకు ఎలాంటి వాపసు లేదా సరైన నష్టపరిహారం ఇవ్వకుండానే ప్రైమ్ సేవలలో ఏకపక్షంగా, ముఖ్యమైన మార్పులు చేయడానికి అమెజాన్‌కు అధికారం కట్టబెట్టాయని ఏసీసీసీ వాదిస్తోంది. 2023 నవంబర్ నుంచి 2025 ఆగస్టు మధ్య కాలంలో పది లక్షల మందికి పైగా కస్టమర్లు సంతకం చేసిన ఒప్పందాలలో ఈ నిబంధనలు ఉన్నాయని రెగ్యులేటర్ పేర్కొంది. వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఏసీసీసీ ఈ దర్యాప్తును ప్రారంభించింది. ఈ కేసులో అమెజాన్‌కు భారీ జరిమానా విధించాలని, ప్రభావితమైన వినియోగదారులకు నష్టపరిహారం ఇప్పించాలని, కోర్టు ఖర్చులు చెల్లించాలని ఏసీసీసీ న్యాయస్థానాన్ని కోరింది. ఈ ఆరోపణలపై అమెజాన్ ఆస్ట్రేలియా ప్రతినిధి స్పందిస్తూ.. "ఏసీసీసీ దాఖలు చేసిన కేసును మేము క్షుణ్ణంగా సమీక్షిస్తున్నాము. దర్యాప్తు ప్రారంభమైనప్పటి నుంచి మేము రెగ్యులేటర్‌కు పూర్తిగా సహకరించాము" అని తెలిపారు. దశాబ్దానికి పైగా ప్రకటనలు లేకుండా అందుబాటులో ఉన్న ప్రైమ్ వీడియో, 2024 ప్రారంభం నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో యాడ్స్‌ను ప్రవేశపెట్టడం గమనార్హం.

# హైదరాబాద్‌కు రెండు గ్రోత్ ఇంజన్లు.. ఒకవైపు పశ్చిమం, మరోవైపు దక్షిణం


**హైదరాబాద్ అభివృద్ధికి రెండు కీలక కారిడార్లుగా వెస్ట్ హైదరాబాద్, భారత్ ఫ్యూచర్ సిటీ**

**వెస్ట్ హైదరాబాద్‌లో కొనసాగుతున్న ఆకాశహర్మ్యాల నిర్మాణం**

**దక్షిణాన ఫ్యూచర్ సిటీని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రేవంత్ ప్రభుత్వం**

**ఫార్మా సిటీ భూములపైనే ఫ్యూచర్ సిటీ అంటూ బీఆర్ఎస్ ఆరోపణలు**

**ఇది పోటీ కాదని, నగరం సామర్థ్యాన్ని పెంచే పరిణామమని నిపుణుల విశ్లేషణ**




హైదరాబాద్ మహానగరం తన ఆర్థిక, రియల్ ఎస్టేట్ సామర్థ్యాన్ని రెండు కీలక కారిడార్ల ద్వారా విస్తరించుకుంటోంది. ఇప్పటికే తిరుగులేని వ్యాపార, సంపద కేంద్రంగా నిలిచిన పశ్చిమ హైదరాబాద్ ఒకవైపు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుండగా, దానికి దీటుగా దక్షిణాన 'భారత్ ఫ్యూచర్ సిటీ' పేరుతో మరో కొత్త అధ్యాయానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ రెండు కారిడార్లు పరస్పరం పోటీ పడకుండా, నగరం భవిష్యత్ అభివృద్ధికి రెండు చోదక శక్తులుగా (గ్రోత్ ఇంజన్లు) పనిచేస్తాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. గత రెండు దశాబ్దాలుగా హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట, నియోపోలిస్ వంటి ప్రాంతాలతో కూడిన పశ్చిమ హైదరాబాద్.. నగరం రూపురేఖలను మార్చేసింది. గ్లోబల్ కంపెనీలు, గ్రేడ్-ఎ ఆఫీస్ స్పేస్‌లు, ప్రీమియం నివాస ప్రాజెక్టులతో ఈ ప్రాంతం హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన రియల్ ఎస్టేట్ మార్కెట్‌గా నిలబెట్టింది. ప్రస్తుతం కోకాపేట, నియోపోలిస్, ఉస్మాన్ నగర్ వంటి ప్రాంతాల్లో 60 నుంచి 70 అంతస్తుల ఆకాశహర్మ్యాల నిర్మాణానికి అనుమతులు లభించడంతో ఇక్కడ అభివృద్ధి నిరంతరాయంగా సాగుతోంది. మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం హైదరాబాద్‌కు నాలుగో నగరంగా 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించింది. రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు మండలం మీర్ఖాన్‌పేటలో జూన్ 10, 2026న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రధాన కార్యాలయాన్ని సీఎం ప్రారంభించారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి దక్షిణంగా, శ్రీశైలం-నాగార్జునసాగర్ జాతీయ రహదారుల మధ్య సుమారు 30,000 ఎకరాల్లో ఈ నగరాన్ని నిర్మించనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రిక్ వాహనాలు, డేటా సెంటర్లు వంటి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా, దేశంలోనే తొలి నెట్-జీరో స్మార్ట్ సిటీగా దీనిని తీర్చిదిద్దుతామని ప్రభుత్వం చెబుతోంది. డిసెంబర్ 2026 నాటికి సింగపూర్‌కు చెందిన డీపీ ఆర్కిటెక్ట్స్ సంస్థ దీని మాస్టర్ ప్లాన్‌ను పూర్తి చేయనుంది. అయితే, ఈ ప్రాజెక్టుపై రాజకీయంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఫార్మా సిటీ'ని రద్దు చేసి, అక్కడి భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం 'ఫ్యూచర్ సిటీ' పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను ప్రభుత్వం ఖండించింది. రైతులకు నష్టం జరగకుండా చూస్తామని, ఫ్యూచర్ సిటీని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ పరిణామాలపై జీహెచ్ఆర్ ఇన్ఫ్రా మార్కెటింగ్ హెడ్, లగ్జరీ రియల్ ఎస్టేట్ రంగ నిపుణులు సురేష్ చింతోజు తన విశ్లేషణను అందించారు. "ఇది ఒక కారిడార్ స్థానంలో మరొకటి రావడం కాదు. హైదరాబాద్ తన అభివృద్ధి సామర్థ్యాన్ని విస్తరించుకోవడం. బలమైన నగరాలు ఒకేచోట కాకుండా బహుళ ఆర్థిక కేంద్రాలను సృష్టించుకుంటాయి. వెస్ట్ హైదరాబాద్ ఇప్పటికే సంపద కారిడార్‌గా స్థిరపడగా, ఫ్యూచర్ సిటీ తదుపరి గ్రోత్ యాక్సిస్‌గా మారవచ్చు. ఈ రెండు కలిసి హైదరాబాద్ తర్వాతి దశ అభివృద్ధిని నిర్దేశిస్తాయి" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ డ్యూయల్ గ్రోత్ విధానం ప్రీమియం రెసిడెన్షియల్, కమర్షియల్ రంగాలను మరింత విస్తరిస్తుందని, హెచ్ఎన్ఐ, ఎన్నారై పెట్టుబడిదారులను ఆకర్షిస్తుందని ఆయన అంచనా వేశారు. మొత్తంమీద, పశ్చిమ హైదరాబాద్ తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటుండగా, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు ప్రణాళిక, మౌలిక సదుపాయాల కల్పన దశలో ఉంది. ఈ రెండు కారిడార్లు కలిసి హైదరాబాద్‌ను భవిష్యత్తుకు సిద్ధం చేస్తూ, నగరాన్ని దీర్ఘకాలిక ఆర్థిక ప్రగతి పథంలో నడిపించనున్నాయి

# ప్రధాన నగరాల్లో తగ్గిన గృహ విక్రయాలు

**సరఫరాలో హైదరాబాద్ టాప్**

**ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 6 శాతం తగ్గిన ఇళ్ల అమ్మకాలు**

**కొత్త ఇళ్ల సరఫరాలో 53 శాతం వృద్ధితో హైదరాబాద్ అగ్రస్థానం**

**అమ్మకాల్లో బెంగళూరు, కోల్‌కతా వృద్ధి.. పూణెలో భారీ క్షీణత**

**పశ్చిమాసియా సంక్షోభం, ఐటీ రంగంలోని అనిశ్చితి కారణమన్న అనరాక్**

**దేశవ్యాప్తంగా 10 శాతం పెరిగిన అమ్ముడుపోని ఇళ్ల సంఖ్య**




దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో గృహ విక్రయాలు మందగించాయి. 2026 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అమ్మకాలు వార్షిక ప్రాతిపదికన 6 శాతం తగ్గినట్లు ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ రీసెర్చ్ తన నివేదికలో వెల్లడించింది. అయితే, ఇదే సమయంలో కొత్త ఇళ్ల సరఫరా మాత్రం పెరగడం గమనార్హం. ముఖ్యంగా హైదరాబాద్, ముంబై నగరాల్లో కొత్త ప్రాజెక్టులు భారీగా ప్రారంభమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే, ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో కలిపి సుమారు 90,715 నివాస గృహాలు అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే సమయంలో ఈ సంఖ్య 96,285గా ఉంది. మరోవైపు, కొత్త ఇళ్ల సరఫరా వార్షికంగా 7 శాతం పెరిగింది. కొత్త ప్రాజెక్టుల విషయంలో ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎమ్ఎమ్ఆర్), హైదరాబాద్ ముందున్నాయి. హైదరాబాద్‌లో కొత్త సరఫరా ఏకంగా 53 శాతం పెరిగి రికార్డు సృష్టించింది. ఇక్కడ దాదాపు 16,970 కొత్త యూనిట్లు అందుబాటులోకి వచ్చాయి. ఎమ్ఎమ్ఆర్‌లో 34,555 యూనిట్లతో 23 శాతం వృద్ధి నమోదైంది. సరఫరా పెరిగినప్పటికీ అమ్మకాలు మాత్రం ఆశించిన స్థాయిలో లేవు. అత్యధికంగా 28,710 యూనిట్లు అమ్ముడైన ఎమ్ఎమ్ఆర్‌లో సైతం గతేడాదితో పోలిస్తే 8 శాతం క్షీణత కనిపించింది. హైదరాబాద్‌లో అమ్మకాలు కేవలం 2 శాతం మాత్రమే పెరిగాయి. అయితే, బెంగళూరు మాత్రం ఈ ట్రెండ్‌కు భిన్నంగా నిలిచింది. అక్కడ అమ్మకాలు ఒక శాతం పెరిగి 15,285 యూనిట్లుగా నమోదయ్యాయి. కోల్‌కతాలోనూ 10 శాతం వృద్ధి కనిపించింది. మరోవైపు, పూణెలో అమ్మకాలు అత్యధికంగా 15 శాతం పడిపోయాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం, ఐటీ/ఐటీఈఎస్ రంగంలోని అనిశ్చితి కారణంగా చాలామంది ఇళ్లు కొనాలనుకునేవారు 'వేచి చూసే ధోరణి' అవలంబిస్తున్నారని అనరాక్ ఛైర్మన్ అనూజ్ పురి విశ్లేషించారు. ఇదే అమ్మకాల తగ్గుదలకు ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ, పెద్ద లిస్టెడ్ డెవలపర్లు గతంలో కొనుగోలు చేసిన భూముల్లో ప్రాజెక్టులను ప్రారంభించడం వల్ల సరఫరా స్థిరంగా కొనసాగుతోందని తెలిపారు. ఇక దేశవ్యాప్తంగా నివాస గృహాల సగటు ధరలు 7 శాతం పెరిగాయి. అమ్ముడుపోని ఇళ్ల సంఖ్య కూడా 10 శాతం పెరిగి 6.16 లక్షలకు చేరింది. బెంగళూరులో అమ్ముడుపోని ఇళ్ల నిల్వ ఏకంగా 34 శాతం పెరగడం గమనార్హం. మొత్తం మీద, ప్రపంచ పరిణామాల మధ్య భారత రియల్ ఎస్టేట్ రంగం మిశ్రమంగా స్పందిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్‌లో సరఫరా భారీగా పెరగడం వల్ల ఇల్లు కొనుగోలు చేయాలనుకునే వారికి మరిన్ని ఆప్షన్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# భారీగా తగ్గిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర



వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు చమురు కంపెనీలు ఊరట కల్పించాయి. 19 కేజీల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధరను భారీగా తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. ఈ ఏడాది వాణిజ్య సిలిండర్ ధర తగ్గడం ఇదే మొదటిసారి. ఇవాళ్టి నుంచే ఈ కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి. ఢిల్లీలో కమర్షియల్ సిలిండర్‌పై రూ.183.50 మేర ధర తగ్గింది. దీంతో అక్కడ సిలిండర్ ధర రూ.3,113.50 నుంచి రూ.2,930కి చేరింది. కోల్‌కతాలో రూ.174 తగ్గడంతో ధర రూ.3,081.50కి, చండీగఢ్‌లో రూ.181.50 తగ్గింపుతో రూ.2,954.50కి, పాట్నాలో రూ.173 తగ్గింపుతో రూ.3,227కి ధరలు చేరాయి. అలాగే హైదరాబాద్‌లో రూ. 176 తగ్గి రూ. 3,191కి చేరిందిఅంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గడమే ఈ ధరల తగ్గింపునకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని 60 రోజుల పాటు పొడిగించడంతో చమురు ధరలు దిగివచ్చాయి. దీంతో పాటు ప్రపంచంలోని 20 శాతం చమురు రవాణా జరిగే హర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలపై ఒత్తిడి తగ్గింది. అయితే, గృహ వినియోగదారులకు మాత్రం ఈసారి కూడా ఎలాంటి శుభవార్త అందలేదు. 14.2 కేజీల డొమెస్టిక్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. ప్రస్తుతం ఢిల్లీలో గృహ వినియోగ సిలిండర్ ధర రూ.942, కోల్‌కతాలో రూ.968, ముంబైలో రూ.941.50, చెన్నైలో రూ.957.50, హైదరాబాద్‌లో రూ. 994 వద్ద స్థిరంగా కొనసాగుతోంది.

# జూన్‌లో జీఎస్టీ వసూళ్ల జోరు
## రూ.1.94 లక్షల కోట్లు దాటిన ఆదాయం

**గతేడాది ఇదే నెలతో పోలిస్తే 13.9 శాతం వృద్ధి నమోదు**

**దిగుమతులపై జీఎస్టీ రాబడి 34.6 శాతం పెరగడమే ప్రధాన కారణం**

**ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.6.31 లక్షల కోట్లు దాటిన మొత్తం వసూళ్లు**





దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి భారీగా నమోదయ్యాయి. ఈ ఏడాది జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1.94 లక్షల కోట్లు దాటింది. నేడు విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం గతేడాది ఇదే నెలతో పోలిస్తే వసూళ్లు 13.9 శాతం పెరిగాయి. ముఖ్యంగా దిగుమతులపై వచ్చే పన్ను రాబడి గణనీయంగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. వివరాల్లోకి వెళితే.. 2026 జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1,94,812 కోట్లుగా నమోదైంది. గత సంవత్సరం జూన్‌లో ఈ మొత్తం రూ.1,71,105 కోట్లుగా ఉంది. ఈ పెరుగుదలలో దిగుమతులపై వచ్చే జీఎస్టీ వాటానే అధికం. దిగుమతులపై పన్ను రాబడి ఏకంగా 34.6 శాతం పెరిగి రూ.60,038 కోట్లకు చేరుకుంది. అయితే, దేశీయ లావాదేవీల ద్వారా సమకూరిన జీఎస్టీ ఆదాయం మాత్రం 6.5 శాతం వృద్ధితో రూ.1,34,774 కోట్లుగా నమోదైంది. దేశీయ వసూళ్ల వృద్ధి రేటు కంటే దిగుమతులపై వసూళ్ల వృద్ధి రేటు ఎక్కువగా ఉండటం గమనార్హం. రిఫండ్‌ల తర్వాత ప్రభుత్వానికి అందిన నికర జీఎస్టీ ఆదాయం జూన్‌లో 11.2 శాతం వృద్ధితో రూ.1,62,377 కోట్లకు చేరింది. గతేడాది ఇదే నెలలో నికర వసూళ్లు రూ.1,45,984 కోట్లుగా ఉన్నాయి. ఈసారి మొత్తం రిఫండ్‌లు కూడా దాదాపు 30 శాతం పెరిగి రూ.32,436 కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో దేశీయ రిఫండ్‌లు 42.9 శాతం పెరిగి రూ.17,767 కోట్లకు చేరగా, ఎగుమతులపై 'ఐస్‌గేట్' (×జజు+ూజు) ద్వారా ఇచ్చిన రిఫండ్‌లు 15.6 శాతం పెరిగి రూ.14,669 కోట్లుగా ఉన్నాయి. ఇక, నికర ఆదాయాన్ని విశ్లేషిస్తే.. దేశీయ లావాదేవీలపై వచ్చిన నికర జీఎస్టీ రాబడి కేవలం 2.6 శాతం మాత్రమే పెరిగి రూ.1,17,007 కోట్లుగా ఉంది. అదే సమయంలో దిగుమతులపై వచ్చిన నికర కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం ఏకంగా 42.2 శాతం పెరిగి రూ.45,370 కోట్లకు చేరింది. ఇది దిగుమతులపై ఆధారపడి పన్ను వసూళ్లు ఎంతగా పెరిగాయో స్పష్టం చేస్తోంది. ఇక, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) గణాంకాలను పరిశీలిస్తే.. స్థూల జీఎస్టీ వసూళ్లు 8.4 శాతం వృద్ధితో రూ.6,31,699 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే సమయంలో ఈ వసూళ్లు రూ.5,82,542 కోట్లుగా ఉన్నాయి. ఇదే కాలంలో నికర జీఎస్టీ రాబడి 7.1 శాతం పెరిగి రూ.5,40,218 కోట్లుగా నమోదైంది. మే నెలలో కూడా జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లుగా నమోదవగా, జూన్‌లోనూ అదే స్థాయి వసూళ్లు కొనసాగడం ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు సూచికగా నిపుణులు భావిస్తున్నారు.

# వాహనదారులకు భారీ ఊరట
## పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించిన నయారా

**పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 5, డీజిల్‌పై రూ. 3 మేర తగ్గింపు**

**రెండేళ్లలో ఇంధన ధరలు తగ్గడం ఇదే తొలిసారి**

**దిగొచ్చిన అంతర్జాతీయ ముడి చమురు ధరలే కారణం**




దేశవ్యాప్తంగా వాహనదారులకు నయారా ఎనర్జీ భారీ ఊరట కల్పించింది. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 5, డీజిల్‌పై లీటర్‌కు రూ. 3 చొప్పున కోత విధించింది. దేశవ్యాప్తంగా ఉన్న 7,000కు పైగా నయారా రిటైల్ ఔట్‌లెట్లలో ఈ తగ్గిన ధరలు తక్షణమే అమల్లోకి వచ్చాయి. గత రెండేళ్లలో దేశంలో ఒక ఇంధన రిటైల్ సంస్థ ధరలను తగ్గించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడం, కీలకమైన సముద్ర మార్గాలు తిరిగి తెరుచుకోవడంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలోనే నయారా ఎనర్జీ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, రాష్ట్రాల వారీగా ఉండే వ్యాట్ వంటి స్థానిక పన్నుల కారణంగా తుది రిటైల్ ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. నయారా ధరలను తగ్గించినప్పటికీ, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు మాత్రం పాత ధరలనే కొనసాగిస్తున్నాయి. దేశంలోని 90 శాతానికి పైగా ఇంధన మార్కెట్‌ను నియంత్రించే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ( బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ( హెచ్‌పీసీఎల్ ) తమ ధరలలో ఎటువంటి మార్పు చేయలేదు. ఢిల్లీలోని ఐఓసీ బంకుల్లో పెట్రోల్ లీటర్ రూ. 102.12, డీజిల్ రూ. 95.20 వద్ద స్థిరంగా ఉన్నాయి. కాగా, ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో మార్చి 26న నయారా పెట్రోల్‌పై రూ. 5, డీజిల్‌పై రూ. 3 పెంచింది. తాజా తగ్గింపుతో ఆ పెంపును పూర్తిగా వెనక్కి తీసుకున్నట్లయింది. మరోవైపు మే నెల ద్వితీయార్థంలో ప్రభుత్వ రంగ సంస్థలు పలు దఫాలుగా పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ. 7.50 చొప్పున పెంచడం గమనార్హం.

# స్వల్పంగా పుంజుకున్న పసిడి

**ఒకరోజు తగ్గుదల తర్వాత స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు**

**తెలుగు రాష్ట్రాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,050**

**22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ.1,30,210గా నమోదు**

**ప్రధాన మెట్రో నగరాల్లో ధరల్లో స్వల్ప తేడాలు**



దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు బుధవారం స్వల్పంగా పుంజుకున్నాయి. క్రితం రోజు తగ్గుముఖం పట్టిన పసిడి ధరలు తిరిగి కోలుకున్నాయి. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర సుమారు రూ.1,42,050 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం.. హైదరాబాద్, విజయవాడ, వరంగల్ వంటి ప్రధాన నగరాల్లో 10 గ్రాముల 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ.1,30,210గా నమోదైంది. ఇక 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,06,540 వద్ద ఉంది. నిజామాబాద్, ఖమ్మం వంటి పట్టణాల్లోనూ ఇవే ధరలు అమలవుతున్నాయి. ఇతర ప్రధాన నగరాలతో పోలిస్తే చెన్నైలో పసిడి ధరలు కాస్త అధికంగా ఉన్నాయి. అక్కడ 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,990గా పలికింది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా వంటి మెట్రో నగరాల్లో ధరలు రూ.1,42,050 నుంచి రూ.1,42,200 మధ్య స్వల్ప వ్యత్యాసాలతో ట్రేడ్ అవుతున్నాయి. బంగారం కొనుగోలు చేసే ముందు వినియోగదారులు మార్కెట్‌లోని అప్పటి ప్రత్యక్ష ధరలను సరిచూసుకోవడం ఉత్తమం.

## మళ్లీ పాత రూట్లోకి అల్లరి నరేష్..

### పుట్టినరోజు కానుకగా 'రంభ ఊర్వశి మేనక' ఫస్ట్ లుక్ రిలీజ్!



టాలీవుడ్ సీనియర్ హీరో, కామెడీ కింగ్ అల్లరి నరేష్ నేడు తన పుట్టినరోజును జరుపుకుంటున్నారు. అయితే ఈ ప్రత్యేకమైన సందర్భాన్ని పురస్కరించుకుని తన అభిమానులకు ఆయన ఒక అదిరిపోయే ట్రీట్ ఇచ్చారు. తన కెరీర్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 65వ సినిమా టైటిల్‌ను, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా ప్రకటిస్తూనే, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ఖరారు చేశారు. ఈ చిత్రానికి 'రంభ ఊర్వశి మేనక' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ సరికొత్త సోషియో ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్‌ను సెప్టెంబర్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో అత్యంత ఘనంగా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం స్పష్టం చేసింది. గత కొంతకాలంగా సీరియస్ ఎమోషనల్ కథలతో అలరించిన నరేష్, చాలా విరామం తర్వాత మళ్లీ తన మార్క్ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌తో రాబోతుండటంతో ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రానికి చంద్ర మోహన్ చింతడ దర్శకత్వం వహిస్తుండగా, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ కలయికలో వస్తున్న మొదటి ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. 'యముడికి మొగుడు' సినిమా తర్వాత దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం అల్లరి నరేష్ మళ్లీ ఒక ఫాంటసీ జానర్ వైపు అడుగులు వేస్తుండటంతో ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి "కామెడీ గోస్ కాస్మిక్" అనే ఒక క్రేజీ ట్యాగ్‌లైన్‌ను కూడా జత చేశారు, ఇది సినిమాలోని వినోద స్థాయి ఏ రేంజ్‌లో ఉండబోతోందో ముందే హింట్ ఇస్తోంది. ఇక తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ విషయానికి వస్తే, ఇది నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఆకాశంలో మేఘాల మధ్య దేవలోకానికి వెళ్లే మెట్లపై అల్లరి నరేష్ ఎంతో స్టైలిష్‌గా కూర్చుని ఉండటం, ఆయన చేతిలో రంభ, ఊర్వశి, మేనకల పేర్లు రాసి ఉన్న ఒక పురాతన శాసనం పట్టుకుని ఉండటం పోస్టర్‌లో కనిపిస్తోంది. అలాగే ఆయన చుట్టూ మేఘాలలో అప్సరసలు విహరిస్తున్న దృశ్యం ఫాంటసీ ఎలిమెంట్స్‌ను అద్భుతంగా ఎలివేట్ చేస్తోంది. రంగురంగుల గ్రాఫిక్స్‌తో, వైవిధ్యమైన డిజైన్‌తో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే.. ఇంద్రలోకానికి, భూలోకానికి మధ్య జరిగే ఒక మాయాజాలం, అందులో నుంచి పుట్టే కడుపుబ్బ నవ్వించే కామెడీ, ఊహించని ట్విస్టులతో ఈ సినిమా సాగనుందని స్పష్టమవుతోంది. ఈ భారీ విజువల్ కామెడీ డ్రామాలో వెన్నెల కిషోర్, నరేష్ వికె, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## ఈ సారి నమ్మండి.. నేను మాట్లాడను

టాలీవుడ్ అక్కినేని అఖిల్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా జూలై 3న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ మూవీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా కనిపించనుంది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో వస్తోన్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే వైజాగ్ వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా ఈవెంట్‌కు హాజరైన అఖిల్ ఈ మూవీపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. నా సినిమా వచ్చి ఇప్పటికీ మూడేళ్లయిందని.. సారీ బ్రదర్.. ఈ విషయంలో నన్ను క్షమించాలంటూ అభిమానులను కోరారు అఖిల్. నా గుండెలపై చేయి వేసుకుని చెబుతున్నా.. ఈ సారి నేను మాట్లాడను.. కేవలం నా సినిమానే మాట్లాడుతుందన్నారు. ఇంతకుమించి నేనేం చెప్పకూడదు.. రెండు రోజులుగా నేను నిద్రపోలేదు.. కళ్లద్దాలు పెట్టుకుని వద్దామనుకున్నానని తెలిపారు. మిమల్ని చూస్తుంటే జూలై 10 వరకు పనిచేసే ఎనర్జీ వచ్చిందని అభిమానులను ఉద్దేశించి అఖిల్ మాట్లాడారు.





## రావు బహదూర్ మూవీ.. ట్రైలర్ రిలీజ్

సత్యదేవ్ హీరోగా వస్తోన్న లేటేస్ట్ సైకలాజికల్ థ్రిల్లర్ రావు బహదూర్. ఈ చిత్రానికి వెంకటేష్ మహా దర్శకత్వం వహించారు. ఈ మూవీలో దీపా థామస్ హీరోయిన్‌గా నటించింది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా జూలై 3న థియేటర్లలో సందడి చేయనుంది. గతంలో ఆయన డైరెక్ట్ చేసిన 'కేరాఫ్ కంచరపాలెం, ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' చిత్రాలు టాలీవుడ్‌లో మంచి విజయాన్ని అందుకున్నాయి. ఈ చిత్రాన్ని మహేశ్ బాబు, నమ్రతా శిరోద్కర్ సొంత నిర్మాణ సంస్థ జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ మూవీ ట్రైలర్ మహేశ్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైంది. ఈ ట్రైలర్ ట్రైలర్ చూస్తుంటే సైకలాజికల్ థ్రిల్లర్ మూవీగానే తెరకెక్కించినట్లు తెలుస్తోంది. మునుపెన్నడు చూడని తెలుగు సినిమా రావు బహదూర్ అంటూ ఒక్కసారిగా అంచనాలు పెంచేశారు మహేశ్ బాబు. కాగా.. ఈ చిత్రంలో వికాస్ ముప్పాల, బాల పరాసర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాక, కునాల్ కౌశిక్, మాస్టర్ కిరణ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు స్మరణ్ సాయి సంగీతమందించారు.

## సుడిగాలి సుధీర్ సినిమా.. 'లైలం బాబు'గా శివాజీ



సుడిగాలి సుధీర్ హీరోగా ప్రసన్న కుమార్ కోట దర్శకత్వం వహిస్తున్న చిత్రం హైలెస్సో. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో కోర్ట్ సినిమాలో తన ఇంటెన్స్ నటనతో ఆకట్టుకున్న శివాజీ 'లైలం బాబు' అనే పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. శివాజీ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పోస్టర్‌లో నల్లటి దుస్తులు, పంచెకట్టుతో రాతి సింహాసనంపై కూర్చొని, చేతిలో సీసా పట్టుకుని శివాజీ కనిపించిన తీరు ఆయన పాత్రలోని పవర్ ని చూపిస్తోంది. 'లైలం బాబు' పాత్రలో శివాజీ తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ అవతార్‌లో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఈ ఫస్ట్ లుక్ తో సినిమాపై మరింత ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో నటాషా సింగ్, నక్ష శరణ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రముఖ కన్నడ నటి అక్షర గౌడ ఈ కీలక పాత్రలో కనిపించనున్నారు. మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బెవర దుహిత శరణ్య ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు.



## పొలిటికల్ ఎంట్రీపై రాఘవ లారెన్స్ యూటర్న్.. అభిమానులకు భారీ షాక్!

నటుడు రాఘవ లారెన్స్ రాజకీయ ప్రవేశంపై గత కొద్దిరోజులుగా కోలీవుడ్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ జోరుగా చర్చ సాగుతోంది. తను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలా వద్దా అనే నిర్ణయాన్ని పూర్తిగా తన అభిమానులకే వదిలేస్తున్నట్లు లారెన్స్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పోటీ చేసి తప్పుకున్న తిరుచ్చి ఈస్ట్ (తిరుచిరాపల్లి తూర్పు) నియోజకవర్గం నుంచి లారెన్స్ బరిలోకి దిగబోతున్నారంటూ సోషల్ మీడియాలో విపరీతంగా రూమర్స్ చక్కర్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో వాటన్నింటికీ అడ్డుకట్ట వేస్తూ, తన రాజకీయ భవిష్యత్తుపై లారెన్స్ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేశారు. తాజాగా మంగళవారం మధ్యాహ్నం సోషల్ మీడియా వేదికగా దాదాపు 16 నిమిషాల నిడివి గల ఒక సుదీర్ఘమైన వీడియోను పోస్ట్ చేసిన లారెన్స్, తన పొలిటికల్ ఎంట్రీపై పూర్తి క్లారిటీ ఇచ్చారు. వైరల్ అవుతున్న వార్తల్లో నిజం లేదని, తాను తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గం నుండి పోటీ చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే అంతటితో ఆగకుండా, తాను ఎన్నికల్లో పోటీ చేయనంత మాత్రాన రాజకీయాల్లోకి రానని అనుకోవద్దని వ్యాఖ్యానించాడు. ప్రస్తుతం తన పూర్తి ఫోకస్ కేవలం సినిమాలపైనే ఉందని, ఒప్పుకున్న ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడమే తన మొదటి ప్రాధాన్యతని వివరించారు. తాను ప్రత్యక్షంగా ఎన్నికల్లో నిలబడకపోయినా, తన ట్రస్ట్ ద్వారా సమాజానికి చేసే సేవలు మరియు సహాయ కార్యక్రమాలు ఎప్పటిలాగే నిరంతరాయంగా కొనసాగుతాయని ఈ కాంచన హీరో వెల్లడించారు.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com